## యెమెన్ విషయంలో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు

పాకిస్థాన్‌కు ఇరాన్ వార్నింగ్

సౌదీ-టర్కీ-పాకిస్థాన్ రక్షణ ఒప్పందంపై ఇరాన్ తీవ్ర అభ్యంతరం

యెమెన్‌లో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిక

2లో




# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి:01 | సంచిక:46 | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | సోమవారం, అక్టోబర్,12, 2026 | పేజీలు:12 | వెల:10రూ/-


# ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యేలా లక్ష్యం

- అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నారాయణ ఆదేశాలు
- అక్టోబర్ 2028 నాటికి రాజధాని పూర్తి చేయడమే లక్ష్యమని వెల్లడి



- ఐకానిక్ టవర్ల పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

**అమరావతి, ట్రైనెట్ న్యూస్:** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు 2028 అక్టోబరు నాటికి పూర్తి చేయడమే

మిగతాది 2లో

# ఢిల్లీలో సీజేపీ నేతల విడుదల

- అందుకే సీఈసీపై పోరాటాన్ని తమపైకి మళ్లించుకుంది: సీజేపీ
- సీఈసీకి వ్యతిరేక నిరసనను ప్రభుత్వం తమపైకి మళ్లించుకుంటోందని సీజేపీ ఆరోపణ

2లో



# అమ్మవారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలి

**ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సీఎం చంద్రబాబు దసరా నవరాత్రుల శుభాకాంక్షలు**

అధర్మంపై ధర్మం గెలిచిన పండుగ దసరా అని వ్యాఖ్య

ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్ష

రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వెల్లడి



**అమరావతి, ట్రైనెట్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం (అక్టోబరు 11) ప్రారంభమవుతున్న నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయన సోషల్ మీడియా వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు. దుష్టశక్తులపై దైవశక్తి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి దసరా పండుగ ప్రతీక అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నేడు ప్రారంభమవుతున్న శరన్నవరాత్రుల్లో అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఆరాధించడం మన సంప్రదాయంలో ఎంతో విశిష్టమైనది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలి" అని ఆకాంక్షించారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని, ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని చంద్రబాబు మనస్ఫూర్తిగా కోరుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తన సందేశంలో పేర్కొన్నారు. హిందూ సంప్రదాయంలో దసరా పండుగకు, శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉన్న ప్రాధాన్యతను ఆయన తన మాటల్లో గుర్తుచేశారు.



# నిరసనలు చేపడుతున్న యువతను చూసి గర్వపడుతున్నా

- కచ్చితంగా ఓడిస్తాం
- మోదీ, షా, భాగవత్, జ్ఞానేశ్, దోభాల్ లక్ష్యంగా రాహుల్ విమర్శలు

**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** ప్రస్తుతం నడుస్తున్న భారత కథలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్, జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఏ) అజీత్ దోభాల్‌లే విలన్లని కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. వారిని తాము చుట్టుముడుతున్నామని, అంతిమంగా ఓడించి తీరుతామని ఉద్ఘాటించారు. మోదీ ఎంతమంది పోలీసులను తెచ్చుకున్నా.. తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. నిరసనలు కొనసాగించాలంటూ యువతకు పిలుపునిచ్చారు. ఢిల్లీలో సీజేపీ నిరసనను అడ్డుకునేందుకు పోలీసులు భారీ స్థాయిలో నిర్బంధాలకు

మిగతాది 2లో

# ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా..

- రామచందర్‌రావుకు పొన్నం సవాల్



**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్:** ఓటు కోల్పోయిన ఒక్కరినైనా చూపించగలరా.. అంటూ తెలంగాణ భాజపా చీఫ్ రామచందర్‌రావు చేసిన సవాల్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తానని.. తేదీ, సమయం చెప్పాలని సవాల్ విసిరారు 'సర్' పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓట్లు తొలగించారని ఆరోపించారు. రాష్ట్రంలో 70 లక్షల ఓట్లు, హైదరాబాద్‌లో 40లక్షల ఓట్లు పోయాయన్నారు. ఓటరు జాబితా సమగ్ర ప్రక్షాళనను సరిగా చేయాలని.. అంతేగానీ ఓటు కోసం కొట్లాడేవారిని దూషించడం తగదన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో.. అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకూడదని పేర్కొన్నారు.

# కార్టూన్లతో తప్పుదోవ పట్టిస్తున్నారు



మంత్రి కొల్లు రవీంద్ర

ఆర్థిక నేరాల కేసుల నుంచి తప్పించుకునేందుకే జగన్ కాలయాపన చేస్తున్నారన్న మంత్రి

ఈడీ విచారణకు రాజకీయ రంగు పులుముతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ

వివేకా హత్య కేసులోనూ జగన్ రాజకీయ నాటకాలు ఆడారని తీవ్ర విమర్శలు

అవినీతి సొమ్ముతో పెట్టిన సాక్షి పత్రికతో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపణ

కేసుల విచారణ వేగవంతం చేసి నిజాలు బయటపెట్టాలని మంత్రి రవీంద్ర డిమాండ్

2లో



# పడవ బోల్తా.. 109 మంది వలసదారుల మృతి

**అమరావతి, ట్రైనెట్ న్యూస్:** ఆఫ్రికా దేశమైన జిబూటి తీరంలో పడవ మునిగిపోయిన ఘటనలో 109 మంది వలసదారులు మృతి చెందారు. మరణించిన వారిలో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు ఉన్నారు. మరో 116 మందికి పైగా గల్లంతయినట్లు అంతర్జాతీయ వలసల సంస్థ ప్రకటించింది. ప్రమాద సమయంలో పడవలో దాదాపు 350 మంది ఉన్నట్లు సమాచారం. జిబూటి నుంచి యెమెన్‌కు వెళ్తుండగా.. గుహెరే ప్రాంతానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 80 మందికిపైగా ఇథియోపియా పౌరులు ప్రాణాలతో బయటపడినట్లు తెలుస్తోంది. అధికారులు ఘటనాస్థలంలో

2లో

# రాకోటలో 'మాటా-మంతి'..

## గిరిజనుల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారాలు

- వైసీపీ మద్దతుదారులు ఉన్న పంచాయతీలకు కూడా నిధులు కేటాయించామని వెల్లడి
- రూ.2,052 కోట్లతో 'అడవితల్లి బాట 2.0' కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి





**అమరావతి, ట్రైనెట్ న్యూస్:** "వైసీపీ మద్దతుదారులకు ఒకటే చెబుతున్నాం. మేం అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూస్తున్నాం. ఏ పార్టీ బతకాలనేది కాదు, వ్యవస్థలు బతకాలి, గ్రామాలు బాగుపడాలి, ప్రజల జీవితాలు మెరుగుపడాలి. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత, వైసీపీ మద్దతు ఉన్న పంచాయతీలకు కూడా అవసరమైన నిధులు అందేలా చర్యలు తీసుకున్నాను" అని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి

మిగతాది 2లో

# ఢిల్లీలో సీజేపీ నేతల విడుదల




మొదటి పేజీ తరువాయి

- గత 72 గంటల్లో దేశంలో ఎమర్జెన్సీని మించిన అరాచకం చూశామన్న అశుతోష్ రంకా
- మోదీ, అమిత్ షా ఆదేశాలతోనే ఎన్నికల సంఘం పనిచేస్తోందని విమర్శ
- సీజేపీ వ్యవస్థాపకుడి కుటుంబ విషాదంలో ఢిల్లీ పోలీసుల తీరు అమానుషమని వ్యాఖ్య
- తమ పోరాటానికి మద్దతిచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులకు కృతజ్ఞతలు

**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తాము చేస్తున్న శాంతియుత నిరసనలను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, అందుకే ఈ పోరాటాన్ని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంగా మార్చుకుందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తీవ్రంగా ఆరోపించింది. ముందస్తు అరెస్టు కింద అదుపులోకి తీసుకున్న తర్వాత విడుదలైన కొన్ని గంటలకే, సీజేపీ సహ కన్వీనర్ అశుతోష్ రంకా ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అశుతోష్ రంకా మాట్లాడుతూ, "గత 72 గంటల్లో దేశం తీవ్రమైన అరాచక పాలనను చూసింది. నిర్దేశిత ప్రాంతంలో శాంతియుతంగా నిరసన తెలియజేయాలనుకున్న వేలాది మందిని దేశవ్యాప్తంగా అదుపులోకి తీసుకున్నారు. నిన్న మమ్మల్ని విమానం నుంచి కిడ్నాప్ చేసినంత పని చేశారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, మేము మా తల్లిదండ్రుల నుంచి విన్న 1975 ఎమర్జెన్సీ కథలను కూడా ఈ 72 గంటల పరిణామాలు మించిపోయాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. "ఒక విషయం స్పష్టమైంది. ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ పోరాటాన్ని ప్రధాని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంగా మార్చారు" అని ఆయన పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం, పూర్తిగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాల కనుసన్నల్లోనే పనిచేస్తోందని, కేవలం బీజేపీని ఎన్నికల్లో గెలిపించడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కుటుంబంలో జరిగిన విషాదం పట్ల ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై అశుతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అభిజీత్ నాయనమ్మ మరణవార్త తెలిసినప్పుడు కూడా ఢిల్లీ పోలీసులు అత్యంత అమానవీయంగా ప్రవర్తించారని, కెమెరాలు, మైక్రోఫోన్లతో వచ్చి ఆ విషాదాన్ని కూడా ఒక ప్రదర్శనగా మార్చడానికి ప్రయత్నించారని ఆరోపించారు. "తన తల్లిదండ్రులు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, వారికి సులభంగా ఆందోళన కలుగుతుందని, అందుకే తన కజిన్‌తో మాట్లాడనివ్వాలని అభిజీత్ వేడుకున్నా ఢిల్లీ పోలీసులు కనికరించలేదు" అని రంకా తెలిపారు. తాను తన నాయనమ్మ అంత్యక్రియల కోసం మహారాష్ట్రలోని సొంత ఊరికి వెళుతున్నానని, అయితే సీజేపీ వెనక్కి తగ్గదని, బెదిరింపులకు భయపడదని అభిజీత్ దిప్కే స్పష్టం చేశారు. అభిజీత్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ దుఃఖ సమయంలో తామంతా అతడికి అండగా నిలుస్తామని రంకా అన్నారు. ఈ పోరాటంలో తమకు మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నేతలకు సీజేపీ కృతజ్ఞతలు తెలిపింది. "నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, మాణిక్ సర్కార్, పినరయి విజయన్ వీధుల్లోకి వచ్చి యువతతో కలిసి నిలబడటం ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి వారు చేస్తున్న పోరాటానికి నిదర్శనం. వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు" అని రంకా పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ వంటి వామపక్ష విద్యార్థి సంఘాల సభ్యులను కూడా పోలీసులు అత్యంత క్రూరంగా అదుపులోకి తీసుకున్నారని ఆయన ఆరోపించారు. "ఈ పోరాటం ఇప్పుడే మొదలైంది. దీనిని ఒక యుద్ధంగా మార్చినందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి"

# రాకోటలో 'మాటా-మంతి'..





మొదటి పేజీ తరువాయి

గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. ఆదివారం పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని కాకవాడ గ్రామంలో "అడవితల్లి బాట 2.0" కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. తాము బాధ్యతలు స్వీకరించాక వైసీపీ మద్దతు ఉన్న పంచాయతీలకు కూడా నిధులు విడుదల చేశామని, తమకు ప్రజల శ్రేయస్సే ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా రూ.2,052 కోట్ల అంచనా వ్యయంతో 2,569 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా 1,341 గిరిజన ఆవాసాలకు 1,976 కిలోమీటర్ల మేర రహదారులు, 45 వంతెనలు నిర్మించనున్నట్లు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రజావసరాలు తీర్చాల్సిన వందల కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులు వేయడానికి, వాటిని తొలగించడానికి దుర్వినియోగం చేసిందని తీవ్రంగా విమర్శించారు. అదే నిధులతో ఎన్నో గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించి ఉండవచ్చన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసైనికులు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు అరెస్టు సమయంలోనూ రోడ్లపైకి వచ్చి పోరాడిన జనసైనికులు, వీరమహిళల త్యాగాలను మరువలేమని అన్నారు. వారి త్యాగాలకు గుర్తింపుగా, పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన కార్యకర్తలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కూటమి నాయకుల కు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా ఉండాలని ఆకాంక్షించారు . గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం ఎంతో క్లిష్టమైన ప్రక్రియ అని, కొండలను తొలచి, రాక్ కటింగ్ వంటి పనులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. తాము నిర్మిస్తున్న రోడ్ల నాణ్యతను స్థానిక ప్రజలే పర్యవేక్షించాలని కోరారు. ఏమైనా లోపాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గిరిజనుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఉద్యానవనాల అభివృద్ధి, పర్యాటక రంగ ప్రోత్సాహం, మొబైల్ కనెక్టివిటీ వంటి చర్యలు చేపడుతున్నామని వివరించారు. అటవీ అనుమతులు వేగవంతం చేసి సెల్ టవర్లు, రహదారుల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కోరిన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. అధికార అహంకారంతో ప్రజలను భయపెట్టే రోజులు పోయాయని, తప్పును ప్రశ్నించే ధైర్యంతో పాటు బాధ్యతగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదివారం గిరిజన గూడెంలో పర్యటించి, అడవి బిడ్డలతో మమేకమయ్యారు. మారుమూల గ్రామానికి స్వయంగా వెళ్లి, చింతచెట్టు కింద రచ్చబండపై కూర్చుని వారి సమస్యలను ఓపికగా విన్నారు. అక్కడికక్కడే పరిష్కారాలు చూపుతూ, కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ఆదేశాలు జారీ చేసి గిరిపుత్రుల్లో భరోసా నింపారు. పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గంలోని రాకోట గిరిశిఖర గ్రామంలో 'అడవి తల్లి బాట 2.0' కార్యక్రమానికి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాకవాడ, రాకోట, సువర్లవాడ, వేములకొండ గ్రామాలను కలిపే 3.4 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ. 2.29 కోట్లతో శంకుస్థాపన చేశారు. అనంతరం రాకోట గ్రామంలో చింతచెట్టు కింద ఏర్పాటు చేసిన 'మాటా-మంతి' కార్యక్రమంలో పాల్గొన్నారు. రాకోటతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ విద్య, వైద్య, మౌలిక వసతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల వినతులపై తక్షణమే స్పందించిన పవన్ కల్యాణ్, శిథిలావస్థలో ఉన్న రాకోట పాఠశాల పునరుద్ధరణకు రూ. 20 లక్షలు, గ్రామ ఆరోగ్య కేంద్రానికి రూ. 15 లక్షలు, హనుమాన్ ఆలయ అభివృద్ధికి రూ. 20 లక్షలు మంజూరు చేశారు. వీటితో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి వివిధ పథకాల కింద సుమారు రూ. 5 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న పవన్ కల్యాణ్‌కు గిరిజన మహిళలు పూలు చల్లుతూ, హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన స్థానిక ఎంపీపీ పాఠశాలను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం వెదురు ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను కలిసి, ప్రభుత్వ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద రైతులకు వ్యవసాయ పనిముట్లను కూడా పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి నేరుగా తమ గ్రామానికి వచ్చి సమస్యలు తీర్చడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

# కార్టూన్లతో తప్పుదోవ పట్టిస్తున్నారు



మొదటి పేజీ తరువాయి

**అమరావతి, ట్రైనెట్ న్యూస్:** వాస్తవాలను పక్కదారి పట్టించి, వాటిని రాజకీయంగా వాడుకోవడమే జగన్ రాజకీయ నీతి అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తనపై ఉన్న ఆర్థిక నేరాల కేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ ఎదుటివారిపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. తన పత్రికలో తప్పుడు కథనాలు, కార్టూన్లతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గుడ్డ కాల్చి ఎదుటివారి మీద వేయడం జగన్‌కు అలవాటుగా మారిందని, దర్యాప్తు సంస్థల విచారణకు రాజకీయ రంగు పులుముతున్నారని ఆరోపించారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ సుమారు రూ.48 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై 2011లో కాంగ్రెస్ హయాంలోనే సీబీఐ కేసులు నమోదు చేసిందని మంత్రి గుర్తుచేశారు. "షెల్ కంపెనీలను సృష్టించి, కంపెనీల వాటాల విలువను కృత్రిమంగా పెంచి, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారనేది ప్రధాన ఆరోపణ. ఈ కేసుల నుంచి తప్పించుకునేందుకే ఇప్పుడు జగన్ నానా తంటాలు పడుతున్నారు" అని రవీంద్ర వివరించారు.

### వివేకా హత్య నుంచి ఈడీ విచారణ వరకు.. అన్నీ నాటకాలే

తన బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోనూ జగన్ రాజకీయ నాటకాలు ఆడారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. "అప్పట్లో చంద్రబాబుపై నిందలు వేస్తూ 'నారాసుర రక్త చరిత్ర' అంటూ సాక్షి పత్రికలో కథనాలు రాయించారు. కానీ, ఆయన చెల్లెలు సునీత న్యాయపోరాటంతో నిజాలు వెలుగులోకి వచ్చి, విచారణ తాడేపల్లి ప్యాలెస్ వైపు దారితీయలేదా?" అని జగన్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం ఈడీ విచారణ వేగవంతం అవుతుండటంతో, దానిని అడ్డుకునేందుకు జగన్ 4,000కు పైగా డిశ్చార్జ్ పిటిషన్లు వేసి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.

### అసత్యాల 'సాక్షి'.. దర్యాప్తు సంస్థలపై దుష్ప్రచారం

అవినీతి సొమ్ముతో ఏర్పాటైన సాక్షి పత్రిక, పేరుకు మాత్రమే సాక్షి అని, అది అసత్యాలకు నిలువుటద్దంగా మారిందని కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఈడీ అనేది కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని స్వతంత్ర దర్యాప్తు సంస్థ అని, రాష్ట్ర ప్రభుత్వానికి దానితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. "విచారణ వేగవంతం అవుతుంటే, దానిపై రాజకీయ కక్ష సాధింపు అని ముద్ర వేస్తూ సాక్షిలో కార్టూన్లు, కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇది దర్యాప్తు సంస్థల మనోస్థైర్యాన్ని దెబ్బతీయడమే" అని అన్నారు.

### ఆర్థిక నేరాలు సమాజానికి క్యాన్సర్ వంటివి

ఆర్థిక నేరాలు దేశ ఆర్థిక వ్యవస్థకు, సమాజానికి క్యాన్సర్ వంటివని సుప్రీంకోర్టే చెప్పిందని మంత్రి గుర్తుచేశారు. "డబ్బుంటే కేసులను ఏళ్ల తరబడి సాగదీయవచ్చా?

## పడవ బోల్తా.. 109 మంది వలసదారుల మృతి

మొదటి పేజీ తరువాయి

సహాయక చర్యలు చేపట్టారు. ఉపాధి అవకాశాలు, భద్రత కోసం గల్ఫ్ దేశాలకు చేరుకోవాలనే ఆశతో ఏటా వేలాదిమంది వలసదారులు జిబూటి మీదుగా ప్రయాణించి.. ప్రమాదకర పరిస్థితుల్లో బాబ్ ఎల్ మండెబ్ జలసంధిని దాటి, యెమెన్‌కు వెళ్తుంటారు. ఐఓఎం వివరాల ప్రకారం.. 2025లో ఈ మార్గంలో 900 మందికిపైగా వలసదారులు మరణించారు/గల్లంతయ్యారు.

## నిరసనలు చేపడుతున్న యువతను చూసి గర్వపడుతున్నా.

మొదటి పేజీ తరువాయి

దిగిన నేపథ్యంలో రాహుల్ 'ఎక్స్'లో వీడియో సందేశం విడుదల చేశారు. "మోదీ, ఆరెస్సెస్‌లతో నేను దశాబ్ద కాలానికిపైగా పోరాడుతూ వస్తున్నాను. వారిని పూర్తిగా అర్థం చేసుకున్నాను. వారంతా పిరికివాళ్లు. 10 వేలు.. 20 వేలు.. 50 వేలు.. ఇలా ఎన్ని వేలమంది పోలీసులను మోదీజీ తెచ్చుకున్నా మేం వెనక్కి తగ్గం. అందర్నీ అరెస్టు చేసినా భయపడం. నా మాటలు రాసిపెట్టుకోండి. మాకు కావాల్సిన సమాచారం ఇప్పటికే అందింది. దేశానికి న్యాయం జరుగబోతోంది. నిరసనలు చేపడుతున్న యువతను చూసి గర్వపడుతున్నా. అదే పంథా కొనసాగించాలని వారికి పిలుపునిస్తున్నా. వ్యవస్థలను అణచివేసే పాలకులను ఓడించి తీరుతాం" అని రాహుల్ పేర్కొన్నారు. "జ్ఞానేశ్ దిగిపోతారు.. ఈ ప్రభుత్వం పడిపోతుంది.. ఆపై ప్రజాస్వామ్య మరమ్మతు ప్రక్రియ ప్రారంభమవుతుంది" అని 'ఎక్స్'లో చేసిన మరో పోస్టులో రాహుల్ పేర్కొన్నారు.

### భాజపా-ఆరెస్సెస్‌ల పిరికితనం తేటతెల్లమైంది: ఖర్గే

దిల్లీలో నిర్బంధాలతో భాజపా-ఆరెస్సెస్‌ల పిరికితనం పూర్తిగా తేటతెల్లమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. "యువత, విద్యార్థులు, న్యాయవాదులు, పాత్రికేయులు, సామాజిక ఉద్యమకారులు, రైతు నేతలు, యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లు.. ఇలా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారందర్నీ పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. ప్రజాస్వామ్య జననిగా పేరున్న మన దేశాన్ని 'నోళ్లు నొక్కిన ప్రజాస్వామ్యం'గా కేంద్ర ప్రభుత్వం మార్చేసింది. నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లు, లాఠీలు, పెల్లెట్లు దేశ ప్రజలను ఆపలేవు. ఇతర విపక్ష పార్టీలతో కలిసి ఈ నిరంకుశ ప్రభుత్వంపై కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుంది" అని ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు.

### ఇది మోదీ, షాల నియంతృత్వం

దిల్లీలో నిర్బంధాలను చూస్తుంటే.. భారత్‌ను ప్రజాస్వామ్య దేశంగా ఇంకెంతమాత్రమూ పేర్కొనలేం. ఇది మోదీ, అమిత్ షాలు నడిపిస్తున్న నియంతృత్వ రాజ్యం. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు వారిద్దరితో చేతులు కలుపుతున్నవారంతా దేశ ద్రోహానికి పాల్పడుతున్నట్టే.

## ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యేలా లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

లక్ష్యమని రాష్ట్ర మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈరోజు ఆయన రాజధాని ప్రాంతంలో పర్యటించి, ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత నెలలో వర్షాల కారణంగా పనులకు కొంత ఆటంకం కలిగిందని, ఇప్పుడు పనులు తిరిగి వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఐకానిక్ టవర్ల నిర్మాణంలో మొదటి డయాగ్రిడ్ పూర్తయిందని, ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యేలా లక్ష్యం నిర్దేశించామని వివరించారు. ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు ఫౌండేషన్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నివాస భవనాలు తుది దశకు చేరుకున్నాయని, నవంబర్ 11 తర్వాత వాటి ప్రారంభోత్సవాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో ప్రస్తుతానికి స్థానిక ఎన్నికలను పెండింగ్‌లో పెడుతున్నామని తెలిపారు. రాజధాని నిర్మాణంపై కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారని నారాయణ మండిపడ్డారు. విమర్శలు చేసేవారు అమరావతికి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూస్తే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో 35 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు ప్రతి నిర్మాణ సంస్థకు స్పష్టమైన టార్గెట్లు విధించామని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్ చాలా వరకు పూర్తయిందని, డిసెంబర్ నాటికి రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించి సింగపూర్ మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని వెల్లడించారు.

## యెమెన్ విషయంలో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు

మొదటి పేజీ తరువాయి

**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** సౌదీ అరేబియా, టర్కీలతో కలిసి పాకిస్థాన్ ఏర్పాటు చేసిన రక్షణ ఒప్పందం కార్యాచరణలోకి రావడంపై ఇరాన్ తీవ్ర స్వరంతో స్పందించింది. యెమెన్ విషయంలో జోక్యం చేసుకుంటే ప్రాంతంపై తీవ్ర దుష్ప్రభావాలు ఉంటాయని హెచ్చరించింది. ముఖ్యంగా, అమెరికాతో చర్చల విషయంలో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ ఈ కూటమిలో చేరడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇరాన్ ఇంటర్నేషనల్ కథనం ప్రకారం, సౌదీ మౌలిక సదుపాయాలపై హౌతీల క్షిపణి, డ్రోన్ దాడులు పెరగడంతో, ఈ త్రైపాక్షిక ఒప్పందం అక్టోబర్ 5 నుంచి కార్యాచరణ దశలోకి ప్రవేశించింది. సౌదీ అరేబియాకు మద్దతుగా టర్కీ, పాకిస్థాన్ చర్యలు ప్రారంభించాయి.

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సోమవారం , అక్టోబర్,12, 2026

www.trinetnews.com

## బంగ్లాదేశ్ నుంచి బంగారం అక్రమ రవాణాపై డీఆర్ఐ ఉక్కుపాదం

### రూ.11.50 కోట్లకు పైగా విలువైన 7.8 కిలోల బంగారం స్వాధీనం.. ఆరుగురి అరెస్టు




Gold seized by DRI Kolkata in the operations

**న్యూ ఢిల్లీ, అక్టోబరు 11 (ట్రైనెట్ న్యూస్):**

బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి బంగారం అక్రమ రవాణా చేస్తున్న ముఠాలపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) చర్యలు ముమ్మరం చేసింది. నిఘా సమాచారం ఆధారంగా అక్టోబరు 8, 9 తేదీల్లో తూర్పు ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో రూ.11.50 కోట్లకు పైగా విలువైన సుమారు 7.8 కిలోల విదేశీ మూలాలున్న బంగారాన్ని స్వాధీనం చేసుకుంది. ఈ కేసుల్లో ఆరుగురిని అరెస్టు చేసింది. సరిహద్దు ప్రాంతాల నుంచి కోల్‌కతాకు బంగారాన్ని తరలించేందుకు ముఠాలు రోడ్డు, రైల్వే మార్గాలను వినియోగిస్తున్నట్లు వెల్లడైంది.

బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలోని బాన్‌పూర్ నుంచి కోల్‌కతా వైపు వెళ్తున్న కారును డీఆర్ఐ అధికారులు డాంకుని టోల్‌ప్లాజా వద్ద అడ్డుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురిని, వాహనాన్ని తనిఖీ చేయగా సుమారు రూ.10 కోట్ల విలువైన 6.8 కిలోల బరువున్న 50 బంగారు కడ్డీలు లభించాయి. వాటిలో కొన్ని బంగారు బిస్కెట్లపై విదేశీ గుర్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

బంగారాన్ని చట్టబద్ధంగా కలిగి ఉన్నట్లు నిరూపించే పత్రాలను నిందితులు సమర్పించలేకపోయారు. బంగ్లాదేశ్ మీదుగా విదేశీ బంగారాన్ని భారత్‌లోకి అక్రమంగా తరలించడంలో తమ ప్రమేయాన్ని వారు వాంగ్మూలాల్లో అంగీకరించినట్లు డీఆర్ఐ తెలిపింది. అరెస్టయిన నలుగురిలో బాన్‌పూర్ సరిహద్దు ప్రాంతంలో పనిచేస్తున్న స్మగ్లింగ్ ముఠా ప్రధాన సూత్రధారి కూడా ఉన్నాడు.

అదే రోజు పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా టౌన్, న్యూ జల్‌పాయిగురి రైల్వే స్టేషన్లలో రైళ్లలో ప్రయాణిస్తున్న ఇద్దరిని డీఆర్ఐ బృందాలు తనిఖీ చేశాయి. వారి వద్ద నుంచి సుమారు రూ.1.5 కోట్ల విలువైన ఒక కిలో విదేశీ మూలాలున్న బంగారాన్ని స్వాధీనం చేసుకున్నాయి. బంగారాన్ని చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు ఆధారాలు చూపించలేకపోవడంతో ఇద్దరినీ అరెస్టు చేశాయి. గాజులు, కడ్డీల రూపంలో ఉన్న ఈ బంగారాన్ని త్రిపురలోని భారత్--బంగ్లాదేశ్ సరిహద్దు మీదుగా అక్రమంగా తరలించిన బంగారంతో తయారు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాలతోపాటు ఈశాన్య ప్రాంతాన్ని కోల్‌కతా వంటి ప్రధాన మార్కెట్లతో అనుసంధానించే రోడ్డు, రైల్వే మార్గాలు బంగారం అక్రమ రవాణాకు వినియోగిస్తున్నట్లు ఈ చర్యలు స్పష్టం చేశాయి. నిఘా ఆధారిత దాడులు, సమన్వయ చర్యల ద్వారా వ్యవస్థీకృత స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లను నిర్వీర్యం చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు డీఆర్ఐ పేర్కొంది.

## కొంకణ్--2026 విన్యాసాల కోసం ప్లిమత్ చేరుకున్న ఐఎన్ఎస్ త్రిశూల్

### భారత్--బ్రిటన్ నౌకాదళాల సమన్వయం బలోపేతమే లక్ష్యం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):**

భారత నౌకాదళానికి చెందిన గైడెడ్ మిసైల్ స్టెల్త్ యుద్ధనౌక ఐఎన్ఎస్ త్రిశూల్ బ్రిటన్‌లోని ప్లిమత్ చేరుకుంది. బ్రిటన్ రాయల్ నేవీతో కలిసి నిర్వహిస్తున్న 'కొంకణ్--2026' ద్వైపాక్షిక సముద్ర విన్యాసాల్లో ఈ నౌక పాల్గొంటోంది.

భారత్--బ్రిటన్ మధ్య ఏటా నిర్వహించే కొంకణ్ విన్యాసాలు ఇరు దేశాల దీర్ఘకాలిక సముద్ర భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. గత రెండు దశాబ్దాల్లో ఈ విన్యాసాల పరిధి, సంక్లిష్టత గణనీయంగా పెరిగాయి. సముద్ర కార్యకలాపాల్లో రెండు నౌకాదళాల మధ్య సమన్వయం, పరస్పర అవగాహనను మెరుగుపరచడంతో పాటు సముద్ర భద్రత సహకారాన్ని బలోపేతం చేస్తున్నాయి. అక్టోబర్ 8 నుంచి 15 వరకు ప్లిమత్ తీరానికి సమీపంలో రెండు దశల్లో విన్యాసాలు నిర్వహిస్తున్నారు. నౌకాశ్రయ దశలో వృత్తిపరమైన చర్చలు, పరస్పర నౌకల సందర్శనలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నారు. సందర్శకులకు యుద్ధనౌకను వీక్షించే అవకాశం కూడా కల్పిస్తున్నారు.

సముద్ర దశలో గగనతలం, సముద్ర ఉపరితలం, నీటి అడుగున జరిగే కార్యకలాపాలకు సంబంధించిన సంక్లిష్ట విన్యాసాలు నిర్వహిస్తారు. ఒక నౌకకు చెందిన హెలికాప్టర్‌ను మరో నౌకపై దించడం, ఆయుధ కాల్పులు, గగనతల రక్షణ సాధన, నౌకల నిర్వహణలో క్లిష్ట విన్యాసాలు, జలాంతర్గాముల నిరోధక సాధన ఇందులో భాగంగా ఉంటాయి.



సురక్షితమైన, స్వేచ్ఛాయుత సముద్రాల కోసం ఇరు దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ విన్యాసాలు పునరుద్ఘాటిస్తున్నాయి. 'భారత్--బ్రిటన్ విజన్ 2035'లో పేర్కొన్న సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి అనుగుణంగా ఇవి కొనసాగుతున్నాయి.

ఉత్తమ విధానాల పరస్పర మార్పిడి ద్వారా క్లిష్టమైన సముద్ర పరిస్థితుల్లో రెండు నౌకాదళాలు సమన్వయంతో పనిచేసే సామర్థ్యాన్ని కొంకణ్--2026 మరింత పెంపొందించనుంది. సముద్ర శాంతి, భద్రత కోసం భారత, బ్రిటన్ నౌకాదళాల మధ్య ఉన్న బలమైన అనుబంధాన్ని ఈ విన్యాసాలు ప్రతిబింబిస్తున్నాయి.

## మత్తుకు దూరంగా.. ఆరోగ్యానికి చేరువగా యువత

### వారణాసిలో 5.5 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీకి నాయకత్వం వహించిన కేంద్ర మంత్రి మాండవీయ




**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):**

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, రోజువారీ జీవితంలో వ్యాయామాన్ని భాగం చేసుకోవాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ పిలుపునిచ్చారు. వారణాసిలో నిర్వహించిన 94వ 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమానికి ఆయన నాయకత్వం వహించారు. 'వికసిత భారత్ కోసం మత్తురహిత యువత' ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా సైక్లిస్టులు, వెయ్యి మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు.

2026 ఐచి--నగోయా ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన ప్రాచీ చౌధరి, పారుల్ చౌధరి, జయ్ కుమార్, రాజ్ కుమార్ పాల్ కార్యక్రమంలో పాల్గొని యువతను ఉత్సాహపరిచారు.

ఉదయం 6 గంటలకు నమో ఘాట్ వద్ద ధ్యానంతో కార్యక్రమం ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో ఉన్న హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ యువజన వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ నివేదిత శ్రేయాన్స్ ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనానికి శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత అవసరమని వివరించారు. అనంతరం కథక్ నృత్య ప్రదర్శన, ఉత్సాహభరితమైన జుంబా సాధన నిర్వహించారు.

ఈ సందర్భంగా మాండవీయ మాట్లాడుతూ యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టి, మత్తురహిత తరాన్ని నిర్మించాలనే సంకల్పంతో మంత్రి, పాల్గొన్నవారు 'నశా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ చేశారు.

అనంతరం నమో ఘాట్ నుంచి సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం వరకు నిర్వహించిన 5.5 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీకి మాండవీయ నాయకత్వం వహించారు. వారణాసి వీధుల్లో సాగిన ఈ ర్యాలీ ద్వారా మత్తురహిత యువత, ఆరోగ్యకరమైన భారత్ సందేశాన్ని ప్రజలకు చేరవేశారు.

## కొంకణ్--2026 విన్యాసాలకు ఐఎన్ఎస్ త్రిశూల్

### బ్రిటన్‌లోని ప్లిమత్ చేరుకున్న భారత యుద్ధనౌక

**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):**

భారత నౌకాదళానికి చెందిన గైడెడ్ మిసైల్ స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ త్రిశూల్ బ్రిటన్‌లోని ప్లిమత్ చేరుకుంది. రాయల్ నేవీతో కలిసి నిర్వహించే 'కొంకణ్--2026' ద్వైపాక్షిక సముద్ర విన్యాసాల్లో ఈ యుద్ధనౌక పాల్గొననుంది.

భారత్--బ్రిటన్ మధ్య ఏటా నిర్వహిస్తున్న కొంకణ్ విన్యాసాలు ఇరు దేశాల దీర్ఘకాలిక సముద్ర భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. గత రెండు దశాబ్దాల్లో వీటి పరిధి, సంక్లిష్టత గణనీయంగా పెరిగాయి. సముద్ర కార్యకలాపాల్లో రెండు నౌకాదళాలు కలిసి పనిచేసే సామర్థ్యాన్ని, పరస్పర అవగాహనను మెరుగుపరుస్తూ సముద్ర భద్రత సహకారంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

అక్టోబర్ 8 నుంచి 15 వరకు ప్లిమత్ తీరానికి సమీపంలో రెండు దశల్లో ఈ విన్యాసాలు నిర్వహిస్తున్నారు. నౌకాశ్రయ దశలో వృత్తిపరమైన చర్చలు, పరస్పర నౌకల సందర్శనలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. సందర్శకులకు యుద్ధనౌకను వీక్షించే అవకాశం కూడా కల్పిస్తున్నారు. సముద్ర దశలో గగనతలం, సముద్ర ఉపరితలం, నీటి అడుగున కార్యకలాపాలకు సంబంధించిన సంక్లిష్ట విన్యాసాలు నిర్వహిస్తారు. ఒక నౌకకు చెందిన హెలికాప్టర్లను మరో నౌకపై దించడం, ఆయుధ కాల్పుల సాధన, గగనతల రక్షణ విన్యాసాలు, క్లిష్టమైన నౌకా నిర్వహణ సాధన, జలాంతర్గాముల నిరోధక విన్యాసాలు ఇందులో భాగంగా ఉంటాయి. సురక్షితమైన, బహిరంగమైన, స్వేచ్ఛాయుత సముద్రాల పరిరక్షణకు ఇరు దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ కార్యక్రమం పునరుద్ఘాటిస్తోంది. 'భారత్--బ్రిటన్ విజన్ 2035'లో పేర్కొన్న సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఉత్తమ విధానాల పరస్పర మార్పిడి, అవగాహన ద్వారా క్లిష్టమైన సముద్ర పరిస్థితుల్లో రెండు నౌకాదళాలు సమన్వయంతో పనిచేసే సామర్థ్యాన్ని కొంకణ్--2026 మరింత బలోపేతం చేయనుంది. సముద్ర శాంతి, భద్రత పట్ల భారత, బ్రిటన్ నౌకాదళాల ఉమ్మడి సంకల్పానికి ఈ విన్యాసాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## రైల్వేలో 3,548 గ్రాడ్యుయేట్ స్థాయి ఉద్యోగాలు

### గూడ్స్ ట్రైన్ మేనేజర్ పోస్టులే 2,750.. నవంబరు 6 వరకు దరఖాస్తులు

**న్యూ ఢిల్లీ, అక్టోబరు 11 (ట్రైనెట్ న్యూస్):**

డిగ్రీ పూర్తి చేసిన యువతకు భారతీయ రైల్వే ఉద్యోగ అవకాశాలను ప్రకటించింది. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు (ఆర్ఆర్‌బీలు) జారీ చేసిన కేంద్రీకృత ఉద్యోగ ప్రకటన సీఈఎన్ నంబరు 06/2026 ద్వారా నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (ఎన్‌టీపీసీ--గ్రాడ్యుయేట్) విభాగంలో మొత్తం 3,548 ఖాళీలను భర్తీ చేయనుంది. వాణిజ్య సేవలు, రైళ్ల నిర్వహణ, ఖాతాలు, పరిపాలన విభాగాల్లో ఈ ఉద్యోగాలు ఉన్నాయి. మొత్తం ఖాళీల్లో గూడ్స్ ట్రైన్ మేనేజర్ పోస్టులు 2,750 ఉండగా, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులు 371, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ పోస్టులు 300, చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ పోస్టులు 127 ఉన్నాయి. ఏడో కేంద్ర వేతన సంఘం ప్రకారం చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ పోస్టుకు పే లెవల్--6 కింద నెలకు రూ.35,400 ప్రారంభ మూలవేతనం లభిస్తుంది. మిగిలిన మూడు కేటగిరీలకు పే లెవల్--5 కింద నెలకు రూ.29,200 ప్రారంభ మూలవేతనం ఉంటుంది. నిబంధనల ప్రకారం ఇతర భత్యాలు వర్తిస్తాయి.

**దరఖాస్తు తేదీలు.. అర్హతలు**

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ అక్టోబరు 8న ప్రారంభమైంది. అర్హులైన అభ్యర్థులు నవంబరు 6 రాత్రి 11.59 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష రుసుము చెల్లింపునకు నవంబరు 8 చివరి తేదీ. దరఖాస్తుల్లో సవరణలకు నవంబరు 9 నుంచి 18 వరకు అవకాశం కల్పించారు.

అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా సమాన అర్హత కలిగి ఉండాలి. ఆయా పోస్టులకు నిర్దేశించిన ప్రత్యేక అర్హతలను కూడా పూర్తి చేయాలి. 2027 జనవరి 1 నాటికి వయస్సు 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి. అర్హత కలిగిన వర్గాలకు నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి.

ప్రతిభ ఆధారంగా ఎంపిక

ఎంపిక ప్రక్రియలో మొదటి దశ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ), రెండో దశ సీబీటీ, అనంతరం వర్తించే విధంగా పత్రాల పరిశీలన, వైద్య పరీక్ష ఉంటాయి. అభ్యర్థుల ప్రతిభ, నిర్దేశిత అర్హతల ఆధారంగా ఎంపిక చేస్తారు. అర్హులకు రిజర్వేషన్లు, వయోపరిమితి సడలింపులు, పరీక్ష రుసుము వాపసు నిబంధనలు వర్తిస్తాయి. అర్హత కలిగిన దివ్యాంగ అభ్యర్థులకు నిబంధనల ప్రకారం సహాయక లేఖకుడి సదుపాయం, అదనపు పరీక్ష సమయం కల్పిస్తారు.

సీఈఎన్ నంబరు 06/2026 ప్రకారం జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులకు కంప్యూటర్ ఆధారిత టైపింగ్ నైపుణ్య పరీక్ష (సీబీటీఎస్‌టీ)ను మినహాయించారు. అయితే అభ్యర్థులకు ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం, టైపింగ్ నైపుణ్యం ఉండాలి. ఉద్యోగంలో చేరిన తర్వాత నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా ఈ నైపుణ్యాలను అంచనా వేస్తారు.

అభ్యర్థులు పూర్తి నోటిఫికేషన్‌ను పరిశీలించి, తాము దరఖాస్తు చేయదలచిన పోస్టుల అర్హతలను నిర్ధారించుకుని, గడువులోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలి.

## అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా 'షీ పవర్' మహిళా భద్రత బైక్ ర్యాలీలి

### జలవిహార్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు ర్యాలీ.. జెండా ఊపి ప్రారంభించిన మంత్రులు జూపల్లి, పొన్నం ప్రభాకర్

**మహిళల భద్రత, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం: మంత్రి పొన్నం ప్రభాకర్**









**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 10:**

మహిళల భద్రత, ఆత్మగౌరవం, సాధికారతపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని షీ పవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో మహిళా భద్రత బైక్ ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని పీవీ మార్గ్ వద్ద జలవిహార్ నుంచి ట్యాంక్‌బండ్ చుట్టూ సాగిన ఈ ర్యాలీని మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. మహిళల భద్రత, రహదారి ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళల హక్కులపై అవగాహన కల్పిస్తూ మహిళా సూపర్ బైకర్లు, స్కూటీ రైడర్లు, సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, మహిళల భద్రత, హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛను కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. మహిళలు తమ కలలను సాకారం చేసుకునేందుకు, విద్యను అభ్యసించేందుకు, అన్ని రంగాల్లో ఎదిగేందుకు సమాన అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. మహిళల భద్రత అనేది మహిళలకు మాత్రమే సంబంధించిన అంశం కాదని, ప్రభుత్వం, పోలీసు వ్యవస్థతో పాటు కుటుంబాలు, విద్యాసంస్థలు, కార్యాలయాలు, సమాజం కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మహిళల పట్ల గౌరవం ఇంటి నుంచే ప్రారంభం కావాలని మంత్రి అన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు మహిళలను గౌరవించే విలువలను నేర్పించాలని సూచించారు. మహిళలు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు కుటుంబ సభ్యులు ప్రోత్సాహం అందించాలని, వారికి స్వేచ్ఛతో కూడిన సురక్షిత వాతావరణాన్ని కల్పించాలని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని మంత్రి గుర్తుచేశారు. కల్పనా చావ్లా అంతరిక్షంలోకి వెళ్లి స్ఫూర్తిగా నిలిచారని, ఆసియా క్రీడల్లోనూ మహిళా క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. మహిళలకు తగిన అవకాశాలు కల్పిస్తే మరిన్ని విజయాలు సాధించగలరని అన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు తమ ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని జూపల్లి సూచించారు. ప్రతిరోజూ కనీసం గంటసేపు వ్యాయామానికి కేటాయించాలని కోరారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, శారీరక దృఢత్వం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక రంగాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు షీ పవర్ ఫౌండేషన్, మహిళా బైకర్లు భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రచారం చేయడంలో మహిళా బైకర్లు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. మహిళల భద్రత, సాధికారత కోసం కృషి చేస్తున్న షీ పవర్ ఫౌండేషన్ నిర్వాహకులను మంత్రులు అభినందించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహిళల భద్రత, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని గుర్తుచేశారు. మహిళలు నిర్భయంగా ప్రయాణించేలా ప్రభుత్వం, పోలీసు శాఖతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతర అవగాహన అవసరమని, చిన్నారులకు ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం కల్పించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సుల జారీలో పారదర్శకత కోసం ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ స్టేషన్లను విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఛైర్మన్ తారిక్ అన్సారీ, మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ చైర్‌పర్సన్ ప్రీతి రెడ్డి, డీసీపీ శిల్పవల్లి, సీబీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డా. నరసింహులు, షీ పవర్ ఫౌండేషన్ ఛైర్మన్ మనీష్, ఫౌండేషన్ నిర్వాహకులు అపూర్వ శ్రీవాస్తవ, అల్పనా శరత్, మహిళా సూపర్ బైకర్లు, స్కూటీ రైడర్లు, సైక్లిస్టులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## బెంగాల్ గవర్నర్‌తో ఉత్తరాఖండ్ యువ ప్రతినిధుల భేటీ

### యువ సంగమం ఏడో దశలో పశ్చిమ బెంగాల్ సాంస్కృతిక వారసత్వ పరిచయం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):**

'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న యువ సంగమం ఏడో దశలో ఉత్తరాఖండ్ యువ ప్రతినిధుల బృందం పశ్చిమబెంగాల్‌లో పర్యటిస్తోంది. ఈ సందర్భంగా అక్టోబర్ 8న పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్. రవితోవిద్యార్థులు,అధ్యాపకులుసమావేశమయ్యారు . విద్యాభ్యాసం, సాంస్కృతిక పరస్పర మార్పిడి, దేశంలోని వివిధ ప్రాంతాల యువత మధ్య సంబంధాలను బలోపేతం చేయాల్సిన అవసరంపై చర్చించారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖలోని ఉన్నత విద్యా విభాగం జాతీయ సమైక్యతను పెంపొందించడం, యువత మధ్య అనుబంధాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జంటలుగా ఎంపిక చేసిన 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన యువతకు దేశంలోని విభిన్న సంస్కృతులు, విద్యాసంస్థలు, ఆవిష్కరణ వ్యవస్థలు, అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకునే అవకాశం కల్పిస్తోంది. హేమవతి నందన్ బహుగుణ గఢ్వాల్ విశ్వవిద్యాలయం నోడల్ సంస్థగా వ్యవహరిస్తున్న




ఉత్తరాఖండ్ బృందం పర్యటన అక్టోబర్ 7న ప్రారంభమైంది. ఆతిథ్య సంస్థ ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రతినిధులకు ఘన స్వాగతం పలికింది. పశ్చిమ బెంగాల్ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వం, సంప్రదాయాలు, విద్యారంగాన్ని పరిచయం చేసేలా పర్యటనను నిర్వహిస్తోంది.

సాంస్కృతిక సందర్శనల్లో భాగంగా అక్టోబర్ 9న ప్రతినిధులు కోల్‌కతాలోని ప్రిన్సెప్ ఘాట్‌తో పాటు సుందర్‌బన్ ప్రాంతాన్ని సందర్శించారు. హుగ్లీ నదీ తీరంలోని ప్రసిద్ధ ప్రిన్సెప్ ఘాట్ వద్ద కోల్‌కతా చారిత్రక వైభవాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించారు. వివిధ ప్రాంతాల ప్రజలతో మమేకం కావడం, భౌగోళిక సరిహద్దులకు అతీతంగా స్నేహబంధాలను ఏర్పరచుకోవడం ద్వారా ఈ పర్యటన 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రతిబింబిస్తోంది. ఇటువంటి ప్రత్యక్ష అనుభవాలు యువతలో జాతీయ సమైక్యత, పరస్పర గౌరవం, భారతదేశ వైవిధ్యంపై అవగాహన న పెంపొందించేందుకు దోహద పడుతున్నాయి.

## నైపుణ్యంతో కొలువుల బాట!

### సింగరేణి ఆర్జీ--1 నైపుణ్య శిక్షణ కేంద్రం నుంచి 112 మంది ఉద్యోగాలకు ఎంపిక

### ఫాక్స్కాన్లో 87 మంది మహిళలకు అవకాశం

**తొలి విడతలో బయలుదేరిన 55 మంది మహిళలు**

హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:

సింగరేణి ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలనిస్తోంది. రామగుండం--1 ఏరియాలోని సింగరేణి జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా తాజాగా 154 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 127 మంది మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. వీరిలో 87 మంది హైదరాబాద్లోని ఫాక్స్కాన్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 27 మంది పురుష అభ్యర్థులు సోలార్ టెక్నీషియన్ ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. వీరిలో 25 మంది సోలార్ టెక్నీషియన్లుగా ఉద్యోగాల్లో చేరనున్నారు. ఫాక్స్కాన్కు ఎంపికైన మహిళల్లో తొలి విడతగా 55 మంది ఆదివారం గోదావరిఖని నుంచి హైదరాబాద్కు బయలుదేరారు. శిక్షణ నుంచి ఉపాధి వరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఈ కేంద్రం స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలను అందిస్తోంది. గత రెండేళ్లలో 500 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించింది. మార్కెట్ లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటోంది. మహిళలకు తయారీ రంగంలో అవకాశాలు ఫాక్స్కాన్ కంపెనీ ఆధ్వర్యంలో గత వారం జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో మహిళా అభ్యర్థులకు ప్రత్యేక ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హైదరాబాద్లోని కంపెనీ తయారీ కేంద్రంలో ఆపిల్ ఇయర్పాడ్స్, ఎలక్ట్రానిక్ విడిభాగాల అసెంబ్లింగ్ విభాగాల్లో పనిచేసేందుకు 87 మంది మహిళలను



ఎంపిక చేశారు. స్థానిక మహిళలకు పారిశ్రామిక రంగంలో లభించిన ఈ అవకాశాలు వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడనున్నాయి. సోలార్ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ పొందిన 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆర్జీ--1 జీఎం డి. లలిత్ కుమార్ తెలిపారు. వీరు పది రోజుల్లో ఎల్ అండ్ ఎన్ కంపెనీలో ఉద్యోగాల్లో చేరనున్నట్లు పేర్కొన్నారు.

నైపుణ్యాలతో భవిష్యత్తుకు పునాది సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువతకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు సంస్థ కృషి చేస్తోందని జీఎం డి. లలిత్ కుమార్ అన్నారు. శిక్షణను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానించడం ద్వారా యువత మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునే అవకాశం లభిస్తోందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో పనిచేస్తూ వృత్తిలో ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్వో టు జీఎం ఎస్.కె. చంద్రశేఖర్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, టాస్క్ మేనేజర్ డాక్టర్ కౌసల్య, ఎల్ అండ్ ఎన్ డైరెక్టర్ కౌశల్, ఫాక్స్కాన్ హెచ్ఆర్ ప్రతినిధి శ్రీ ఆర్. శ్రీనివాస్, జీవీటీసీ మేనేజర్ మాధవరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని, ఇవి మన సాంప్రదాయాలను గుర్తు చేస్తాయని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు





హైద్రాబాద్, త్రైనెట్ న్యూస్, అక్టోబర్,11.

పండుగలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని, ఇవి మన సాంప్రదాయాలను గుర్తు చేస్తాయని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం రాత్రి బన్సీలాల్ పేట డివిజన్ లోని ఐ డి హెచ్ కాలనీలో గల అవర్ లేడీ ఆఫ్ హెల్త్ చాపెల్ చర్చిలో నిర్వహించిన ఫీస్ట్ ఫెస్టివల్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 2 నుండి 10 వ తేదీ వరకు ఈ ఫెస్టివల్ ను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. చివరి రోజున మేరీమాత ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మనకు పండుగలు అనేకం ఉన్నా క్రిస్మస్ మాత్రం ప్రతి సంవత్సరం డిసెంబర్ 25 న ప్రపంచ వ్యాప్తంగా నెలరోజుల పాటు జరుపుకోవడం జరుగుతుందని గుర్తు చేశారు. క్రైస్తవులు ప్రతి ఆదివారం చర్చికి వెళ్ళి ప్రార్థనలు చేయడం, చర్చిలో ఫాదర్ చెప్పే సూక్తులు ఎంతో శ్రద్ధగా వినడం జరుగుతుందని అన్నారు. దీంతో భక్తిభావం, క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. కార్యక్రమంలో పాదర్ ప్రతాప్, పాదర్ నవీన్ కుమార్, అధ్యక్షుడు జోసఫ్ సన్నీ, ప్రధాన కార్యదర్శి పాదర్ రాజు, ఉపాధ్యక్షుడు శశిరాజ్, ఆంథోని, ఫ్రాన్సిస్ జేవియర్, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు కొత్తూరు వెంకట్, గజ్జెల శ్రీనివాస్, వెంకటరమణ, సురేష్, వినోద్, ప్రేమ్ కుమార్, కుమార్ యాదవ్, దేశపాక శ్రీనివాస్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతినికేతన్ లో బతుకమ్మ సంబరాలు





హయత్ నగర్, త్రైనెట్ న్యూస్ 11:

బతుకమ్మపండుగతెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని శాంతినికేతన్ టాలెంట్ స్కూల్ చైర్మన్ జి. రాధాకృష్ణ అన్నారు. ఆదివారం శాంతి నికేతన్ టాలెంట్ స్కూల్ లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల బోధన సిబ్బంది, విద్యార్థులు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఝాన్సీ, డీన్ ఫణిశ్రీ ప్రభంజని, ప్రిన్సిపల్ స్వరూప, ఆఫీస్ ఇంచార్జ్ మమత, ఇంచార్జ్ లు చందర్, శివ కృష్ణ, సౌమ్య, సంగీత తదితరులు పాల్గొన్నారు.

## స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి ఎలగందుల సురేష్‌కు యూనిస్కో కౌన్సిల్ సభ్యులు వెంకటరమణ రావు అదోని మద్దతు



నల్గొండ, అక్టోబరు 11 (త్రైనెట్ న్యూస్):

స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ ఎలగందుల సురేష్‌కు శ్రీ దత్త ఇన్ఫోటెక్ కన్సల్టెంట్స్ వ్యవస్థాపకులు, సీఈఓ అదోని వెంకట రమణ రావు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తొలిసారిగా ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలుస్తున్న సురేష్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

నల్గొండకు చెందిన సురేష్ ఎన్నో సంవత్సరాలుగా జర్నలిస్టుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కృషి చేస్తున్నారని వెంకట రమణ రావు పేర్కొన్నారు. విద్యావంతుడిగా, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా వెనుకబడిన వర్గాల సమస్యలు, హక్కులు, అభివృద్ధి అంశాలపై స్పందిస్తున్నారని తెలిపారు.జర్నలిజంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ సురేష్ చురుకుగా పాల్గొంటున్నారని చెప్పారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఆయనకు తన మద్దతు ఉంటుందని వెంకట రమణ రావు వెల్లడించారు.

## ఆవేశం తగ్గితే...ఆలోచన పెరుగుతుంది.

### అదుపు తప్పిన భావోద్వేగం..బూడిదయ్యే బంధాలు, భవిష్యత్తు

త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:

కొడుకు తనకు నచ్చని అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు అన్న అక్కసుతోనో ఏమోగానీ "ఎలా పెంచారు నిన్ను మీ అమ్మ వాళ్లు? నువ్వు వచ్చిన దగ్గర నుండి నాశనం అయ్యాము మేము" అంటూ అరిచింది అత్తగారు. అప్పటికే చాలాసార్లు ఇలాంటి మాటలు విని, ఇక ఆపుకోలేక "ఏమైనా ఉంటే నన్ను అనండి. మా తల్లిదండ్రులను ఎందుకు అంటున్నారు?" అని అనేసింది కోడలు. "మా ఆవిడకే ఎదురు సమాధానం చెప్తావా? ఇదేనా నీ సంస్కారం?" అంటూ మామగారు కోడలు మీదికి చెయ్యెత్తారు. "నువ్వు ఎవరివి అసలు నా మీద చెయ్యెత్తడానికి? ఆ మాత్రం నేను తిరిగి కొట్టలేనా?" అంటూ కోడలు కూడా చేయెత్తింది. "నా ముందే మా నాన్నతో గౌరవం లేకుండా మాట్లాడుతావా? నీకు ఎంత ధైర్యం. నాకు నువ్వు అవసరమే లేదు ఇక" అంటూ ఆమెను ఇంట్లోంచి గెంటేసిన భర్త. పుట్టింటికి వెళ్ళిన భార్య అవమాన భారంతో ఆత్మహత్య ప్రయత్నం చేసింది. కూతురి ఆత్మహత్యకు భర్తే కారణం అంటూ ఆమె తల్లిదండ్రులు పోలీస్ కేసు పెట్టారు. ఇప్పుడు భర్త జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి. అసలు విషయం ఎక్కడ మొదలైంది? ఎక్కడిదాకా వెళ్ళింది? ఎలాగైనా ఎదుటివారిని దోషిగా నిలబెట్టే ప్రయత్నం, సందర్భం గెలవాలని తాపత్రయమే తప్ప అసలు ఏం చేస్తున్నాం అనే ఆలోచన ఎవరికి ఉంది? ఓ 4 లేక 5 గంటలు చేసే ప్రయాణం గురించి అయినా ఏ సమయానికి మొదలవ్వాలి, వెంట ఏమేం తీసుకెళ్లాలి, ఎలా వెళ్ళాలి, ఎక్కడ ఆగాలి, ఏ సమయానికి చేరుకోవాలి? అని ఒక పది నిమిషాలు అయినా ఆలోచిస్తాం కదా. అలాంటిది ఓ 60 లేదా 70 సంవత్సరాలు గడిపే జీవితం ఇది. ఓ పని చేసే ముందు కాస్తయినా ఆలోచన ఉండాలి కదా.




మన ఆలోచన కన్నా ముందే మన భావోద్వేగాలు పరిగెత్తినంత కాలం మనం ప్రశాంతంగా ఉండలేము మన చుట్టూ ఉన్న వాళ్ళని కూడా ప్రశాంతంగా ఉంచలేము.న్యూటన్ మూడవ గమన నియమం ప్రకారం "ప్రతీ చర్యకు దానికి సమానమైన మరియు వ్యతిరేకమైన ప్రతిచర్య ఉంటుంది." ఎదుటివారి మాట లేదా ప్రవర్తన వలన మనం కోపంతోనో, బాధతోనో స్పందించాల్సిన పరిస్థితి రావచ్చు. కానీ మన స్పందన ఎలా ఉంటుందో దానికి తగిన ప్రతిచర్య కూడా ఎదుటి వాళ్ల నుండి వస్తుంది కదా. మరి ఆ ప్రతిచర్యను కూడా ఎదుర్కోవాల్సింది మళ్లీ మనమే కదా. అందుకే జరిగిన సంఘటనలకు స్పందించే ముందు కాస్త ఆగి, ఆలోచిస్తే మంచిది.బంధుత్వాన్ని వదులుకోవడం ఎంతసేపు? నిమిషం చాలు. కానీ ఒకసారి మన మాట, ప్రవర్తనతో పోగొట్టుకున్న బంధాన్ని మళ్లీ తిరిగి పొందాలంటే చాలా సమయం పట్టొచ్చు, చాలా కష్టపడాల్సి రావచ్చు. కోపంలో ముందు వెనక ఆలోచించకుండా మాటలు అని, ఆ సందర్భంలో మనిషిని గెలవగలవేమో కానీ మనసుని మాత్రం గెలవలేవు.ఎదుటి మనిషి మాట లేదా ప్రవర్తన నీకు నచ్చలేదు అనుకుందాం. వెంటనే ఓ మాట అనేయకుండా ఒక్కసారి ఆగి ఆలోచించండి. "ఆ వ్యక్తి నిజంగా నీ మీద ద్వేషంతోనే అలా అన్నారా? నిన్ను రెచ్చగొట్టడానికి ఆ మాటలు మాట్లాడారా? అతను అన్న మాటలో ఎంతవరకు నిజం ఉంది? అతను గతంలోనూ మీతో ఇలాగే ప్రవర్తించారా? లేదా కోపంతో ఒక మాట నోరు జారారా? వాళ్ళు నీ మంచిని కోరే వారేనా? ఎప్పుడైనా నీకోసం, నీ కష్ట సమయంలో తోడుగా నిలబడ్డారా? అతను అన్న మాటలు రేపు ఇంకొకరు అనకూడదు అంటే మన ప్రవర్తనలో ఏం మార్పు రావాలి?" అని కాస్త ఆలోచిస్తే వారి ప్రవర్తనకు మనం ఎలా స్పందించాలో మనకు అర్థమవుతుంది. ఎదుటివారు కోపంలో అనే మాటల తీవ్రత మన మెదడు వరకే ఆగాలి. మనసు దాకా రానివ్వకూడదు.వాళ్లుఅరిచినవెరే స్పందించనవసరం లేదు. కాస్త ఆగి ఆలోచించాక, మన నిర్ణయం సరైనది అనిపించాక, సరైన పద్ధతిలో సరైన సమాధానం ఇస్తే సరిపోతుంది. చివరిగా ఒక్క మాట: "ఎవరేమన్నా నిశ్శబ్దంగా భరించండి" అని అనట్లేదు కానీ "బదులుగా మనం స్పందించే ముందు, మన భావోద్వేగాలు అదుపులో ఉంటే బంధాలు నిలబడతాయి, భవిష్యత్తు ప్రశాంతంగా ఉంటుంది" అని చెప్పడం మాత్రమే నా ఉద్దేశం.

M. JAYA KRISHNA REDDY
M.S.(Counselling & Psychotherapy)
Motivational Speaker
Cell: 9640 21 55 41

## గోవాలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

### బీజేపీ పాలనలో డ్రగ్స్, భూ మాఫియా పెరిగిపోయాయి



గోవా, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:

2027లో గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో గోవా ప్రజలు విసిగిపోయారని, మరోసారి ఆ పార్టీకి అవకాశం ఇస్తే రాష్ట్రంలోని భూములు, ఆస్తులు ఇతరుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని విమర్శించారు. గోవాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు, రాహుల్ గాంధీ ప్రతినిధిగా తాను గోవాకు వచ్చానని రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో నిరసన కార్యక్రమాల కారణంగా రాహుల్ గాంధీ రాలేకపోయారని చెప్పారు.బీజేపీ ప్రభుత్వ హయాంలో గోవా డ్రగ్స్‌కు కేంద్రంగా మారిందని, యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆరోపించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ రాష్ట్ర అభివృద్ధి కంటే ఆస్తులను ఇతరులకు అప్పగించడంపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. డ్రగ్స్ మాఫియా, భూ మాఫియాకు అడ్డుకట్ట వేయాలంటే కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.

**ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోంది**

జ్ఞానేష్ కుమార్ పేరుతో పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలను ఏకం చేసేందుకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపడితే, ప్రధాని మోదీ ప్రజలమధ్య విభజనలు సృష్టిస్తున్నారని విమర్శించారు. బీజేపీని రావణుడితో, కాంగ్రెస్‌ను రాముడితో పోల్చిన ఆయన.. బీజేపీని ఓడించేందుకు గోవా ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో, 2027లో గోవాలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గోవా నుంచి ప్రారంభమయ్యే రాజకీయ మార్పు దేశవ్యాప్తంగా విస్తరించి, ఢిల్లీలో ఎర్రకోటపై కాంగ్రెస్ త్రివర్ణ పతాకం ఎగురవేసే రోజు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు ఎన్‌ఫోర్సబుల్ అధికారాలు కల్పించాలి: కల్వకుంట్ల కవిత

-కమిషన్లకు బలమైన అధికారాల కోసం రాజ్యాంగ సవరణ జరగాలి

-ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలి



హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:

ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు కేవలం సిఫారసులు చేసే అధికారాలే కాకుండా, తమ ఆదేశాలను అమలు చేయించగలిగే ఎన్‌ఫోర్సబుల్ అధికారాలు కల్పించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం రాజ్యాంగ సవరణ జరగాలని, ఈ దిశగా ఎమ్మెల్యేలు, ఎంపీలు పోరాటం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్లతో పాటు మహిళా, మానవ హక్కుల, బాలల కమిషన్లు కూడా పూర్తిస్థాయి అధికారాలు లేకుండా పనిచేస్తున్నాయని కవిత అన్నారు. ఆయా కమిషన్లు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలకు సూచించడం మినహా, తమ నిర్ణయాలను అమలు చేయించే అధికారం లేకపోవడం వల్ల బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. కమిషన్లకు రాజకీయ నాయకుడు చైర్మన్‌గా ఉండాలా, రిటైర్డ్ న్యాయమూర్తి ఉండాలా అన్నదానికంటే, వాటికి ఎలాంటి అధికారాలు ఉన్నాయన్నదే ముఖ్యమని స్పష్టం చేశారు.

**ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు అవసరం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎస్సీ, ఎస్టీలకు కలిపి ఒకే కమిషన్ ఏర్పాటు చేయడం సరైన నిర్ణయం కాదని కవిత అభిప్రాయపడ్డారు. ఎస్సీల సమస్యలు, ఎస్టీల సమస్యలు భిన్నంగా ఉంటాయని, వాటిని ప్రత్యేకంగా పరిష్కరించేందుకు రెండు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఉండేవని గుర్తుచేశారు.

వివక్ష, దోపిడీ, అత్యాచారాలు, అణచివేత వంటి అనేక సమస్యలను ఎస్సీలు ఎదుర్కొంటున్నారని, ఎస్టీలకు సంబంధించిన సమస్యలు కూడా ప్రత్యేక దృష్టితో పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేస్తామని, అప్పటివరకు ఈ డిమాండ్ సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

**అంబేడ్కర్ ఆశయాల సాధనకు ఉద్యోగులు కృషి చేయాలి**

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సమాజ సమస్యలపై చర్చించేందుకు సమావేశాలు నిర్వహించడం అభినందనీయమని కవిత అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను చూస్తే స్వర్గంలో ఉన్న అంబేడ్కర్ సంతోషిస్తారని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ విధులకే పరిమితం కాకుండా సమాజ అభ్యున్నతికి కూడా కొంత సమయం కేటాయించాలని అంబేడ్కర్ పదేపదే కోరేవారని గుర్తుచేశారు. దేశంలో వేల సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ వర్గాలు అనేక రకాల అన్యాయాలు, అణచివేతలను ఎదుర్కొన్నాయని ఆమె అన్నారు. ముఖ్యంగా ఎస్సీలు కనీస మానవ హక్కులకు కూడా నోచుకోని పరిస్థితుల్లో జీవించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ పోరాటం ద్వారా అణగారిన వర్గాలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు లభించాయని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా వెట్టిచాకిరి, భూస్వాముల దోపిడీ, సామాజిక వివక్ష వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చిందని, ఈ నేపథ్యంలో అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు కమిషన్ల అవసరం ఏర్పడిందని వివరించారు.

**కమిషన్ల ఆదేశాలకు చట్టబద్ధమైన బలం ఉండాలి**

ప్రస్తుతం కమిషన్లు ఇచ్చే నివేదికలు, సిఫారసులను ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాల్సిన పరిస్థితి లేదని కవిత అన్నారు. నేరెళ్ల ఘటనను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, ఇప్పటివరకు ఎస్సీ కమిషన్ నివేదిక ఇవ్వలేదని ఆమె పేర్కొన్నారు. ఒకవేళ నివేదిక వచ్చినా దాన్ని అమలు చేయాల్సిన తప్పనిసరి బాధ్యత ప్రభుత్వానికి లేకపోతే బాధితులకు ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు.

కమిషన్లకు అధికారాలు ఉంటే బాధితులకు సత్వర న్యాయంఅందేఅవకాశంఉంటుందనిఅభిప్రాయపడ్డారు. కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా, సెబీ, ఎన్నికల కమిషన్ వంటి సంస్థలకు ఉన్న అధికారాలను ఉదాహరణగా పేర్కొంటూ, ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు కూడా బలమైన అధికారాలు కల్పించాలని కోరారు. కమిషన్ల నిర్ణయాలను కోర్టుల్లో సవాల్ చేసే అవకాశం ఉండటం, వాటి ఆదేశాల అమలుపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు కూడా సమస్యల పరిష్కారాన్ని ప్రభావితం చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి దశాబ్దాలు గడిచినా అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణలో ఆశించిన మార్పులు రాకపోవడానికి కమిషన్లకు తగిన అధికారాలు లేకపోవడం కూడా ఒక కారణమని అన్నారు.

**రాజకీయ వ్యవస్థలోనూ బాధ్యతాయుతమైన నాయకత్వం అవసరం**

ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు రాజకీయ నాయకులను చైర్మన్లుగా నియమించకూడదన్న వాదనతో తాను ఏకీభవించనని కవిత అన్నారు. రాజకీయాలు హుందాగా, ప్రజల సమస్యలను అర్థం చేసుకునే విద్యావంతులు, బాధ్యతాయుతమైన వ్యక్తుల భాగస్వామ్యంతో సాగాలని ఆకాంక్షించారు. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు స్పందించి, వారి బాధను అర్థం చేసుకోగలిగే నాయకత్వం అవసరమని చెప్పారు. అన్ని రంగాల్లో ఉన్నట్లుగానే రాజకీయాల్లోనూ కొంతమంది చెడ్డవాళ్లు ఉండవచ్చని, అందువల్ల మొత్తం వ్యవస్థను తప్పుపట్టడం సరికాదని అన్నారు. కమిషన్లలో వివిధ రంగాలకు చెందిన నిపుణులతో పాటు ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలపై అవగాహన ఉన్నవారికి ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు.

**అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలి**

దేశంలో మానవ హక్కుల పరిరక్షణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. వ్యాపార రంగంలో బలమైన సంస్థలకు ఉన్న అవకాశాలతో పోలిస్తే, దళిత పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునే క్రమంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణతో పాటు అన్ని కమిషన్లకు సమర్థవంతమైన అధికారాలు కల్పించేందుకు సమిష్టిగా పోరాటం చేయాలని కవిత పిలుపునిచ్చారు. రాజ్యాంగ సవరణ ద్వారా కమిషన్ల అధికారాలను బలోపేతం చేయాలని, అణగారిన వర్గాలకు న్యాయం జరిగేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన జగిత్యాల క్రీడాకారులకు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అభినందనలు







**జగిత్యాల జిల్లా అక్టోబరు 11 (ట్రైనెట్ న్యూస్):**
జగిత్యాల జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (స్గఫ్ ) 2026--27 సంవత్సరానికి నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జగిత్యాల క్రీడాకారులను జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ అభినందించారు. జగిత్యాల కేలో ఇండియా బాక్సింగ్ సెంటర్‌కు చెందిన క్రీడాకారులు అండర్--14, అండర్--17 విభాగాల్లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాకారులను అభినందిస్తూ రాష్ట్రస్థాయి పోటీలలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జగిత్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కోచ్ నవీన్ ను అభినందించారు.

అండర్--14 విభాగంలో సిహెచ్. గుణతేజ, వి. మిధున్, అసిత్, ఇస్మాయిల్, అండర్--17 విభాగంలో ఎల్. కార్తికేయ, హృదయ్, సిహెచ్. వైష్ణవి, కే .వాసవి,ఎస్. స్వరాలి తదితర క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

క్రీడాకారులు కష్టపడి సాధన చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఖేలో ఇండియా బాక్సింగ్ సెంటర్ ను అందరూ ఉపయోగించుకోవాలి అని,చదువు తో పాటు శారీరక దారిద్యం ముఖ్యమే అన్నారు ఎమ్మెల్యే.

ఈ కార్యక్రమంలో సీనియర్ బాక్సింగ్ కోచ్ ఆరుముల పవన్, కేలో ఇండియా కోచ్ నల్ల నవీన్, జగిత్యాల సింగిల్ విండో చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం,మాజీ సర్పంచ్ మహేశ్వర్ రావు శరత్ రావు మహేందర్ రావు ఈశ్వర్ బాలముకుందం,తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ మండల క్రికెట్ టోర్నమెంట్ కట్కాపూర్ టీంకు టీ షర్టు స్పాన్సర్ చేసిన సర్పంచ్ పడాల పూర్ణిమ తిరుపతి

**రాయికల్ అక్టోబరు 11 (ట్రైనెట్ న్యూస్):**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న సందర్భంగా దిశా కమిటీ మెంబర్ ధావన్ పల్లి బిక్కు కోరిక మేరకు టీ షర్ట్స్ స్పాన్సర్ చేయడం జరిగింది అని కట్కాపూర్ గ్రామ సర్పంచ్ పడాల పూర్ణిమ తిరుపతి అన్నారు
ఈ సందర్భంగా పడాల పూర్ణిమ తిరుపతి మాట్లాడుతూ క్రీడలుమానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అందరిని ప్రోత్సహించాలని వారు సూచించారు ఈ కార్యక్రమానికి హాజరై క్రికెట్ ఆడుతున్న టీములను అభినందించడం జరిగింది



# జగిత్యాల జయ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే డా, సంజయ్ కుమార్ని ఆహ్వానించినా నిర్వాహకులు



**జగిత్యాల జిల్లా అక్టోబరు 11 (ట్రైనెట్ న్యూస్):**
జగిత్యాల పట్టణం జయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న 15 వ పంచదశ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు జగిత్యాల నియోజకవర్గ మ్మెల్యే డా, సంజయ్ కుమార్ ని నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించారు

ఈ సందర్భంగా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని జగిత్యాల నియోజకవర్గ మ్మెల్యే డా,సంజయ్ కుమార్ కి అందజేశారు.అనంతరం జయదుర్గా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ..దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించేలా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జయదుర్గా సేవా సమితి నిర్వాహకులు ముసిపట్ల లక్ష్మీనారాయణ, దాసరి దామోదర్, నలువాల శ్రీకాంత్, బిట్టు, గాదె కార్తీక్, అలిశెట్టి కిషన్, సింగారావు, నడిపి గంగారాం, తిరుపురం రాంచందర్, ద్యావనపెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పాడ్యమి పర్వదినం పురస్కరించు కొని ప్రత్యేక పల్లకి సేవ, స్వామి వారికి పంచామృత అభిషేకం, ముడుపు సమర్పణ





**రాయికల్ అక్టోబరు 11 (ట్రైనెట్ న్యూస్):**
ఆదివారం (భానువాసరే ఆశ్వీయుజ మాసం శుక్ల పక్షం పాడ్యమిపర్వదినం సందర్భంగా సూర్య ధన్వంతరి
ఉషా చాయ సమేత సూర్య నారాయణ స్వామి వారికి పంచామృత అభిషేకంసూర్య భగవానుని విశిష్టత ఆదివారం -- సూర్య భగవానుని ప్రత్యేక దినంఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైనపవిత్రమైనరోజు. ఈరోజుసూర్యదేవునిఆరాధించడ ంవల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, మరియుప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది. తదియపర్వదినం పురస్కరించుకొని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగవానుకి, పంచామృత అభిషేకాలు, సామూహిక ఆదిత్య హృదయం పారయాణం అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. తదనంతరం అమృత నిర్గుండి కశాయం ఉచిత వితరణ చేయడం జరిగినది తదనంతరం సూర్య భగవాన్ కు భక్తులు ముడుపులు కట్టారు
ఈ కార్యక్రమములోఫౌండర్ &ఛైర్మెన్ డాక్టర్ వద్ద గట్ట రాజన్న,వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్,సహాయ కోశాధికారి గోపి,మేనేజింగ్ ట్రస్టి గట్టు రాజేందర్,భారతాల రాజసాగర్,వోడ్నాల తిరుపతి -సునీత,చిక్కి,చెన్నూరి శ్రీధర్ -సరోజన, మల్లేశ్వరి, గంగాధర్ -జయలక్ష్మి,,వేముల రాజేష్-మేఘన,హరి కృష్ణ -శ్రీ లక్ష్మి, కొక్కు తిరుపతి,యాంసాని శంకరయ్య, హరీష్, అడ్లగట్ట రవీందర్,అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ ఒమాన్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆన్‌లైన్ విద్యా కార్యక్రమాలపై అవగాహన

## -ఉద్యోగుల ఫీజు చెల్లించడానికి, వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయడానికి ముందుకొస్తున్న సంస్థలు

**జగిత్యాల జిల్లా అక్టోబరు 11 (ట్రైనెట్ న్యూస్):**
గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలుగు వారికి ఉన్నత విద్యనుఅందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రారంభించిన ఆన్‌లైన్ విద్యా కార్యక్రమాలపై ఒమన్ లో తెలుగు వారు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారఈ కార్యక్రమానికి సామజిక కార్యకర్త బొక్కెన గంగస్వామి అధ్యక్షత వహించగా, అతిథులుగా గోల్డెన్ ప్యూరిటీ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి షేక్ మదర్, సామాజిక కార్యకర్తలు చిట్టుమల దీపక్, మైదమ్ రామకృష్ణ పాల్గొన్నారు. ప్రత్యేక అతిథులుగా బానోత్ రవి, గుర్రపు మహేందర్, అజిగి శేఖర్, ముంజ మహేష్, షేక్ ఫరూక్, మొహమ్మద్ జమీల్, మొహమ్మద్ సద్దాం, హెచ్ గంగాధర్, మొహమ్మద్ సాజిత్, గూడపాటి మనోజ్ కుమార్ , మైదమ్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గంగస్వామి మాట్లాడుతూ, విద్య మనిషికి జ్ఞానాన్ని అందిస్తుందని, జ్ఞానం బానిసత్వం నుంచి విముక్తిని ప్రసాదిస్తుందని పేర్కొన్నారు. గల్ఫ్‌లోని తెలుగు వారికి ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాన్ని కల్పించిన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డా. ఎల్. విజయకృష్ణ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సౌదీ అరేబియా నుంచి సమన్వయం చేసిన సమాజ సేవకులు శ్రీనివాస్ మచ్చ, మహేష్ కేపీ, మన గల్ఫ్



ఛానల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వేణు పెరుమాళ్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గోల్డెన్ ప్యూరిటీ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి షేక్ మదర్ మాట్లాడుతూ, తన కంపెనీలో పనిచేస్తూ ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే ఉద్యోగులకు మొదటి సంవత్సరం ఫీజును తానే చెల్లిస్తానని, పరీక్షల సమయంలో వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేస్తానని ప్రకటించారు. సామాజిక కార్యకర్తలు దీపక్, రామకృష్ణ కూడా ఒక్కొక్క విద్యార్థికి మొదటి సంవత్సరం ఫీజును చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఇతర అతిథులు సైతం తమకు తెలిసినవారికి, మిత్రులకు, బంధువులకు మరియు ఇతర గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న తెలుగు వారికి డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందిస్తున్న కోర్సులపై విస్తృతంగాప్రచార చేస్తామని, మరిన్ని అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు..

గల్ఫ్‌లో నివసిస్తున్న తెలుగు వారికి విజ్ఞప్తి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందిస్తున్న





ఆన్‌లైన్ విద్యా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని, తమ ఉన్నత విద్యా కలలను సాకారం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. అర్హతలు, అందుబాటులో ఉన్న కోర్సులు, దరఖాస్తు విధానం మరియు చివరి తేదీ వివరాలను యూనివర్సిటీ వెబ్ సైట్ www.braou.ac.in లో పొందొచ్చని లేదా 040-23680333/555/o9190320 76267/o966 54 150 7276/o968 9345 8337 లో సంప్రదించాలని కోరుతూ ఈ అవకాశాలనుప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# బ్రాహ్మీముహూర్తం"ఇన్ని చదివిన తరువాత బ్రాహ్మీముహూర్తంలో లేవడాన్ని ఛాదస్తం అని ఎలా అనుకోగలం చెప్పండి!!

**-సామాజికవేత్త ఆధ్యాత్మిక దైవచింతన గల వ్యక్తిగా దైవరాధకునిగా సనాత ధర్మ పరిరక్షకుడు- ఆడెపు రాజమౌళి**

**రాయికల్ అక్టోబరు 11 (ట్రైనెట్ న్యూస్):**
ఉదయాన్నే నిద్రలేవాలని మన పెద్దవాళ్లు తెగ పోరేవారు. అలా చెప్పీ చెప్పీ చాలా తరాలు వెళ్లిపోయాయి. తరం మారుతున్న కొద్దీ జీవవనశైలి మారిపోతోంది. నిద్రలేచే సమయాలూ, పనిచేసే వేళలూ మారిపోతున్నాయి. కొన్నాళ్ల తరువాత పని చేయడానికీ, నిద్రపోవడానికీ రాత్రీపగలుతో సంబంధమే లేకపోవచ్చు. కానీ ఇప్పటికీ బ్రాహ్మీముహూర్తం- అన్న మాట అక్కడక్కడా వినిపిస్తూనే ఉంటుంది అని సామాజికవేత్త ఆధ్యాత్మిక దైవచింతన గల వ్యక్తిగా దైవరాధకునిగా సనాత ధర్మ పరిరక్షకుడు- ఆడెపు రాజమౌళి అన్నారు ఇంతకీ ఆ బ్రాహ్మీముహూర్తం అంటే ఖచ్చితంగా ఏ సమయంలో వస్తుంది. ఆ సమయంలో నిద్రలేవడం వల్ల ప్రయోజనం ఏంటి! సూర్యోదయానికి96 నిమిషాల ముందున్న కాలాన్ని బ్రాహ్మీముహూర్తం అంటారు. అయితే రుతువుని బట్టి సూర్యోదయ వేళలు మారిపోతూ ఉంటాయి కాబట్టి, 4:00 -4:30 ని బ్రాహ్మీముహూర్తంగా అనుకోవచ్చు. బ్రాహ్మీ అంటేనే సరస్వతి అని అర్థం. మన పెద్దలు చాలా ఆలోచించే ఆ పేరు పెట్టారేమో అనిపిస్తుంది. ఈ సమయంలో నిద్రలేవడం వల్ల ఉపయోగం ఏంటి అని అడిగే ప్రశ్నకు చాలానే జవాబులు వినిపిస్తాయి.

ఆ సమయంలో ప్రకృతి మొత్తం ప్రశాంతంగా, నిద్రలోని ఆఖరి జామును గడుపుతూ ఉంటుంది. సూర్యుని వేడి భూమిని కాస్త తాకుతూ ఉంటుంది, కానీ వెలుతురు ఇంకా మనల్ని చేరుకోదు. అంటే రాత్రివేళ చల్లదనాన్నీ, పగటివేళ చురుకుదనాన్నీ ఏకైక కాలంలో కలిగిఉండే సమయం ఇదన్నమాట! అందుకే ఈ సమయంలో మనుషులు సత్వగుణం ప్రధానంగా ఉంటారట. లేలేత కిరణాలు శరీరాన్ని తాకడంచాలామంచిదనివైద్యులుకూడాచెబుతున్నారు కాబట్టి, ఉదయాన్నే లేచి కాలకృత్యాలు



తీర్చుకుని సూర్యనమస్కారాలు చేయడమో, వ్యాహ్యాళికి వెళ్లడమో చేస్తే ఆరోగ్యానికి మంచిది.
మనలో జీవగడియారం అనేది ఒకటి ఉంటుంది. అది మనం ఏర్పరుచుకున్న అలవాట్లను బట్టీ, ప్రకృతిని బట్టీ నడుచుకుంటూ ఉంటుంది. నిద్రపోవడం,లేవడం,కాలకృత్యాలుతీర్చుకోవడం... ఇవన్నీ సమయానికి అనుకూలంగా చేస్తేనే ఆరోగ్యంగా ఉంటాం. సాక్షాత్తూ ఆయుర్వేదమే తన ఆరోగ్యాన్నీ, ఆయుష్షునూ కాపాడుకోవాలని అనుకునేవాడు బ్రాహ్మీముహూర్తంలో లేవాలి అని చెబుతోంది. పైగా ఆయుర్వేదం ప్రకారం ఈ సమయం వాత ప్రధానంగా ఉంటుంది. శరీరంలో కదలికలనీ, ఆలోచనలనీ, రక్తప్రసరణనీ ప్రభావితం చేసేది ఈ వాత లక్షణం. ఈ లక్షణం మన శరీరంలో ప్రముఖంగా ఉన్నప్పుడు మనం ఎలాంటి పనినైనా చురుగ్గా చేయగలం
ప్రశాంతంగా ఉండగలం మంచి ఆలోచనలు చేయగలం చదివినదానిని ఆకళించు చేసుకుని దీర్ఘకాలం జ్ఞప్తికి ఉంచుకోగలం.
ధ్యానం చేయాలనుకునేవారికి కూడా ఈ సమయం చాలా అనుకూలమని యోగశాస్త్రం చెబుతోంది. మన శరీరంలో ఇడ, పింగళ, సుషుమ్న నాడులు ఉంటాయినియోగులనమ్మకం.బ్రాహ్మీముహూర్తంలో సుషుమ్న నాడి చాలా ఉత్తేజితంగా ఉండి... ధ్యానం చాలా సులువుగానూ, ప్రభావవంతంగానూ సాగే అవకాశం ఉంటుందట.ఉదయాన్నే మన శరీరంలోనూ, చుట్టూ ఉన్న ప్రకృతిలోనూ ఉండే ప్రశాంతత వల్ల యోగా, ధ్యానం, చదువు... చాలా తేలికగా ప్రభావవంతంగా సాగుతాయి. రోజువారీ చేయాల్సిన విధులకు (ఉద్యోగం, కాలేజ్,



వంటావార్పూ...) ముందు కాస్త సమయం చేజిక్కుతుంది. అలా కాకుండా ఆలస్యంగా లేచి ఒక్కసారిగా మన పనులలో చేరేందుకు పరిగెత్తడం వల్ల... మన మనసు, శరీరం విపరీతమైన ఒత్తిడికి లోనవుతాయి.
గుండెజబ్బులు ఉన్నవారికి తెల్లవారుజామునే గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందనీ, పైగా అలా వచ్చే గుండెపోటు చాలా తీవ్రంగా ఉంటుందనీ వైద్య గణాంకాలన్నీ సూచిస్తున్నాయి. గుండెల్లో రక్తనాళాలను గడ్డకట్టించే థ్రోంబస్ అనే సమస్య ఉదయం వేళల్లోనే ఎక్కువగా ఉంటుందట. ఇలా ఎందుకు జరుగుతుందనే దానికి ఖచ్చితమైన కారణాలు ఏవీ చెప్పలేకపోతున్నారు వైద్యులు. పైగా ఇదే సమయంలో మనం హడావుడిగా లేచి విధుల్లోకి చేరాలనే టెన్షన్‌లో మనలోని రక్తపోటు మరింత ఎక్కువై అది గుండెపోటుకి దారితీసే అవకాశాలు ఎక్కువగాఉంటాయి. అయే బ్రాహ్మీముహూర్తంలోనే నిద్రలేచి, వీలైతే కాసేపు ధ్యానం చేసుకుని... స్థిమితంగా రోజువారీ పనులకి సిద్ధపడితే మన రక్తపోటు కూడా సాధారణంగా ఉండే అవకాశం ఉంటుంది. ఇన్నిచదివినితరువాతబ్రాహ్మీముహూర్తంలో లేవడాన్ని ఛాదస్తం అని ఎలా అనుకోగలం చెప్పండి!!అని ఆడెపు రాజమౌళి అన్నారు

# కాంగ్రెస్, కాక్రోచ్ ల దేశ వ్యతిరేక కుట్రలను ఖండించిన భారత్ సురక్ష సమితి నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు

**జగిత్యాల జిల్లా అక్టోబరు 11 (ట్రైనెట్ న్యూస్):**
జగిత్యాల విద్యానగర్లోని స్థానిక కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో నాయకులు ఏసిఎస్ రాజు ఉమ్మడి జిల్లా కార్యదర్శి అక్కినపల్లి కాశీనాథం చిట్ల గంగాధర్ లు మాట్లాడుతూ ఈరోజు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని తలపెట్టిన ఆందోళన వాస్తవానికి సార్ మీదనో, జ్ఞానేష్ కుమార్ మీదనో కాదు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ లాంటి ప్రతిపక్షాల మద్దతుతో దేశంలో ఒక అలజడి సృష్టించి ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం. ఎన్నికల ద్వారా మోడీని ఢీకొట్టడం అసాధ్యమని భావించి ఇలాంటి కుట్రలకు పాల్పడుతుంది. దేశాన్ని అస్థిరపరిచి మోడీ మీద హిందువుల మీద కుట్ర చేయడానికి జరుగుతున్న పన్నాగం ఇది. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారతదేశం



అనేక రకాలుగా అభివృద్ధి సాధిస్తూ వస్తుంది. ఆర్థికంగా ఈరోజు నాలుగో స్థానానికి చేరుకుంది ప్రపంచ దేశాలు భారత్ తో స్నేహ సంబంధాలపై చేతులు చేస్తున్నాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్ అయితే భారతదేశం మాకు ముఖ్యమని చెప్పాడు
ఈరోజు ఇస్లామిక్ దేశలైనా అరబ్ కంట్రీస్ కూడా మోడీ గొప్పతనాన్ని గ్రహించి ఆదేశ అత్యున్నత పురస్కారాలను ఇస్తున్నాయి. భారత్ వికసిత భారత్ గా విశ్వ గురువుగా ఎదుగుతున్న క్రమాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు వీటి మద్దతు తో కాక్రోచ్ జనతా పార్టీ దేశంపై ,మోడీపై కుట్రలు పన్నుతున్నాయి.
సర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని 13కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని నిరాధార ఆరోపణలు చేస్తున్నాయి. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు12 సార్లు సర్ ప్రక్రియ జరిగిందని చివరిసారి 2002 -04 తరువాత ఇప్పుడు 22 సంవత్సరాల తర్వాత మళ్లీ సర్ ప్రక్రియ జరుగుతున్నప్పుడు
ఈ మధ్యకాలంలో చనిపోయిన వారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు రెండు చోట్ల ఓట్లు కలిగిన వారు ఉండటం సర్వసాధారణం. ఇలాంటి కనీస పరిజ్ఞానం లేకుండా జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరడం అవివేకం. ఎన్నికల సంఘం అనేది ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థని దానిలో ప్రభుత్వ జోక్యం ఉండదని తెలిపారు. ఇలాంటి దేశ వ్యతిరేక శక్తులైనా అభిజిత్ దీప్కేజర్మనీ లాంటి విదేశాల్లో ఉంటూ మన దేశంలో ఆందోళనలో పాల్గొనే ధ్రువరాట్ లాంటి వాళ్లను కఠినంగా శిక్షించి దేశ భద్రతను

## స్థానిక ఎన్నికలపై రాజకీయ పార్టీల గురి.. పుంగనూరులో మొదలైన వార్డులవారీ కసరత్తు






**అక్టోబరు 11 (ట్రినెట్ న్యూస్):**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పుంగనూరు పట్టణంలో రాజకీయ సందడి నెలకొంది. ఎన్నికల నోటిఫికేషన్, వార్డులవారీగా రిజర్వేషన్లు, అభ్యర్థుల ఎంపికపై స్పష్టత రావాల్సి ఉన్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ఇప్పటి నుంచే తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన పార్టీలైనటువంటి తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల మధ్య రాజకీయ పోటీపై పట్టణ ప్రజల్లో ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో మరోవైపు జనసేన, భాజపా, ఎస్‌డీపీఐ, సీపీఎం, సీపీఐ, బీసీవై, కాంగ్రెస్ పార్టీల నాయకులు సైతం తమ బలాన్ని పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. పుంగనూరు మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఆశాభావులు ముఖ్య నాయకులను కలుస్తూ తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించడం, ఓటర్లను కలుసుకోవడం, ఆయా ప్రాంతాల్లోని ప్రజా సమస్యలను తెలుసుకోవడం ద్వారా ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. పట్టణంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, మురుగునీటి కాలువలు, రహదారులు, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలు మున్సిపల్ ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశముంది. తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిచ్చే నాయకులు, అభ్యర్థుల వైపు ప్రజలు మొగ్గుచూపే అవకాశం ఉంది. దీంతో ఆశాబావులు పార్టీ పెద్దల దృష్టిలో పడేందుకు ప్రయత్నిస్తుండగా ఎవరికి టికెట్ దక్కుతుందనే అంశంపై ఆయా పార్టీల్లో చర్చలు కొనసాగుతున్నాయి. కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఉంటుందా ఏయే వార్డుల్లో ఎవరికి అవకాశం కల్పిస్తారు ప్రధాన పార్టీల నుంచి బరిలో నిలిచే అభ్యర్థులెవరు అనే ప్రశ్నలు రాజకీయ వర్గాలతో పాటు ప్రజలలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్, రిజర్వేషన్లు, అభ్యర్థుల ఎంపికపై స్పష్టత వచ్చిన తర్వాత పట్టణంలో రాజకీయ సమీకరణాలు మరింత మారే అవకాశముంది. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో ప్రజల మద్దతు ఎవరికి లభిస్తుంది వార్డులవారీగా ఎలాంటి పోటీ నెలకొంటుందనే అంశాలు ఆసక్తికరంగా మారనున్నాయి

## కష్టానికి తగిన గుర్తింపు.. చరణ్ తేజకు అభినందనల వెల్లువ

**అక్టోబరు 11 (ట్రినెట్ న్యూస్):**
చిలకలూరిపేట: నరసరావుపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్తగా మండలనేని చరణ్ తేజ నియమితులైన సందర్భంగా చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆముదాల లీలాకిషోర్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. చరణ్ తేజకు లభించిన ఈ బాధ్యత ఆయన కష్టానికి, పార్టీ పట్ల అంకితభావానికి దక్కిన గుర్తింపు అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆముదాల లీలాకిషోర్ మాట్లాడుతూ.. “కష్టానికి పట్టాభిషేకం చేసిన జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మండలనేని చరణ్ తేజకు నరసరావుపేట పార్లమెంట్ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం ఎంతో సంతోషకరం. యువ నాయకుడిగా చరణ్ తేజ నిరంతరం ప్రజల్లో ఉంటూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, జనసేన బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్నారు” అని అన్నారు. చరణ్ తేజకు అప్పగించిన ఈ బాధ్యత ఆయనపై పార్టీ నాయకత్వానికి ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోందని లీలాకిషోర్ పేర్కొన్నారు. ఈ కొత్త బాధ్యతతో చరణ్ తేజ మరింత ఉత్సాహంగా పనిచేస్తూ, పార్టీ నాయకులు,



కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మండలనేని చరణ్ తేజ రాజకీయ ప్రస్థానంలో ఈ నియామకం మరో కీలక మైలురాయిగా నిలవాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆముదాల లీలాకిషోర్ తెలిపారు.

## రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో చిలకలూరిపేట విద్యార్థిని ప్రభంజనం.. ప్రథమ బహుమతి కైవసం!

**అక్టోబరు 11 (ట్రినెట్ న్యూస్):**
విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో చిలకలూరిపేటకు చెందిన S.P.T.R.K.M SCHOOL విద్యార్థిని షేక్ అప్సర్ అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతిని సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో తన చిత్రలేఖన నైపుణ్యంతో ప్రతిభ చాటుకుని మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. రాష్ట్రస్థాయిలో ఇంతమంది విద్యార్థులతో పోటీపడి ప్రథమ బహుమతి సాధించడం విద్యార్థిని ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. తనలోని సృజనాత్మకతను, కళాత్మక ఆలోచనలను చిత్రలేఖనం ద్వారా అద్భుతంగా ప్రదర్శించి విజేతగా నిలవడం చిలకలూరిపేటకు గర్వకారణంగా మారింది. ఈ విజయంతో S.P.T.R.K.M SCHOOL పేరు రాష్ట్రస్థాయిలో నిలిచింది. విద్యార్థిని షేక్ అప్సర్ సాధించిన ఈ ఘనత పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయసులోనే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి





తన ప్రతిభనుచాటుకుంది

## వైభవంగా అన్నపూర్ణాదేవి దసరా మహోత్సవాలు ప్రారంభం



**అక్టోబరు 11 (ట్రినెట్ న్యూస్):**
పుంగనూరు పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ అన్నపూర్ణాదేవి ఆలయంలో ఆదివారం దసరా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో తొలిరోజు అమ్మవారు కంచిలోని శ్రీ ఏకాంబరేశ్వరి దేవిగా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు రాము శ్రీ సూక్త మంత్రోచ్ఛారణల నడుమ పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పసుపు, కుంకుమతో శ్రీ అన్నపూర్ణాదేవికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మామిడి చెట్టు కింద ఆసీనులై శివుడికి పూజలు చేస్తున్న రూపంలో అన్నపూర్ణాదేవిని సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు రాము మాట్లాడుతూ తమిళనాడులోని కాంచీపురం ఏకాంబరేశ్వర స్వామి ఆలయం ప్రాచీన శివాలయంగా ప్రసిద్ధి చెందిందని ఆయన తెలిపారు. శివపురాణం ప్రకారం పార్వతీదేవి మామిడి చెట్టు కింద ఇసుకతో శివలింగాన్ని రూపొందించి తపస్సు చేసినట్లు ప్రతీతి అని ఆయన వివరించారు. ఆ విధంగా శ్రీ ఏకాంబరేశ్వరి దేవిగా అలంకారంలో శ్రీ అన్నపూర్ణాదేవి భక్తులకు దర్శనమిచ్చారని పేర్కొన్నారు. అనంతరం అమ్మవారికి నిమ్మకాయ దీపాలతో మహా మంగళహారతులు సమర్పించి ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణంతో సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు

## జగిత్యాల జిల్లాలో దుర్గా నవరాత్రి ఉత్సవాలు మండప నిర్వాహకులు పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్ ద్వారా..

**అక్టోబరు 11 (ట్రినెట్ న్యూస్):**
దుర్గానవరాత్రి ఉత్సవాలు మండప నిర్వాహకులు పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీసు వారికి సహకరించాలి – జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అప్లికేషన్ నమోదు చేయుటకు వాడవలసినలింక్ https://policeportal.tspolice.gov.in/ * దుర్గా నవరాత్రి ఉత్సవాలు, విజయదశమి (దసరా) పండుగను ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, తెలిపారు.

జిల్లాలో దుర్గా దేవి మండపాలు, దేవాలయాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలు, రావణ దహనం జరిగే ప్రదేశాలు, ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపడతామని తెలిపారు. దుర్గా దేవి మండపాలు ఏర్పాటు చేసే వారికి జగిత్యాల జిల్లా పోలీసు వారి విజ్ఞప్తిభద్రత, బందోబస్తు కొరకే ఆన్లైన్



నమోదు విధానం. మండప నిర్వాహకులు పోలీసుశాఖవారురూపొందించినhttps://policeportal.tspolice.gov.in/ పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీసు వారికి సహకరించాలి. మండపాలను ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. మండపాలకు పూర్తి బాధ్యత మండపాల నిర్వాహకులదే, ప్రతి మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

మండపంలో 24 గంటలు 4గురు వాలంటరీ ఉండే విధంగా నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలి. మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తతో, ఫైర్ ఎక్సటింగుషేర్ డ్రమ్ముల్లో నీరు, ఇసుకను ఏర్పాటు చేసుకోవాలి.

మండపాలకు వచ్చే భక్తుల సందర్శన దృష్టిలో ఉంచుకొని భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటరీలను నియమించాలి. మండపాల్లో మరియు శోభాయాత్రలో ఎట్టి పరిస్థితుల్లో డీజే లను ఏర్పాటు చేయరాదు.

మండపాల్లో ఏదైనా అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 112, లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.

మండపాల వద్ద నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర కార్యక్రమలు నిర్వహించేటప్పుడు పోలీసు వారికి ముందుగానే తెలియపరచాలి. తద్వారా మండపాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా పోలీస్ శాఖ చూసుకోవడం జరుగుతుంది.

మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చే పోలీస్ శాఖ మండపల వద్ద, శోభాయాత్రలో మహిళలకు, పిల్లలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు. పోలీసు వారు సూచించిన పై నియమాలను మరియు నిబంధనలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో నవరాత్రులు జరగడానికిపోలీసువారికిసహకరించవలసిందిగా కోరుతున్నారు

## ప్రగల్బాలు పలికే మాజీ మంత్రి కేటీఆర్, హరీష్ రావులకు నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే కన్నెపల్లి వద్దకు వచ్చి నీళ్లు ఎలా లిఫ్ట్ చేయాలో- -ఏ కాలువ ద్వారా పారించాలో క్షేత్రస్థాయిలో తేల్చి చెప్పాలి అని నిప్పులు చేరిగిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**అక్టోబరు 11 (ట్రినెట్ న్యూస్):**
వర్షపాతం పరిస్థితులను బట్టి పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎలినో తీవ్ర ప్రభావంతో సాగునీటి ఎద్దడి ఏర్పడి రైతాంగశీ తీవ్ర ఆందోళన తరుణంలో కాలువల్లో చుక్క నీరు లేక రైతులు బాధపడుతుంటే ప్రతిపక్ష నేతలు ఇవాళ రాజకీయ పాబ్బాశీ గడపడానికి అబద్ధాలు ఆడుతున్నారు అని జగిత్యాల జిల్లా డిసిసి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్ అన్నారు ఈ సందర్భంగా మంత్రిమాట్లాడుతూ రైతులను కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి లతో మాట్లాడి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి ఉదయం 9:45 గంటలకి 6.045 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించామని రానున్న తొమ్మిది రోజులపాటు రోజుకు 2000 క్యూసెక్కులకు పైగా సాగునీటిని అందించి పంటలను బతికిస్తామని స్పష్టం చేశారు కన్న పెల్లి పంపు హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోస్తే కేసీఆర్ పేరు వస్తుందని ఉద్దేశంతో ప్రభుత్వం నీళ్లు ఎత్తిపోయడం లేదంటే బిఆర్ఎస్ నేతలు చేస్తున్న చిల్లర ప్రచారాన్ని ఖండించారు రాజకీయ నేతలు పచ్చి అబద్దాలతో ప్రజలు భయపెట్టాలని చూస్తే రైతులు చూస్తున్నారని మీ కెసిఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయినప్పుడు మీ ఇంజనీరింగ్ జ్ఞానం ఏమైంది అని ఎద్దేవ చేశారు మనజగిత్యాల జిల్లాలో మూడు లక్షల పైచిలుక వరి వేషారు పశీటలు కాపాడుతామని రైతులు బాధ పడవద్దని ఆయన అన్నారు



ప్రగల్బాలు పలికే మాజీ మంత్రి కేటీఆర్, హరీష్ రావులకు నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే కన్నెపల్లి వద్దకు వచ్చి నీళ్లు ఎలా లిఫ్ట్ చేయాలో ఏ కాలువ ద్వారా పారించాలో క్షేత్రస్థాయిలో తేల్చి చెప్పాలి అని నిప్పులు చేరుగారు

అసెంబ్లీలో గత పదివేల పాపాల చిట్టాలు అసెంబ్లీలో ప్రభుత్వం బహిర్గతం చేస్తే నోరు మెదపరు విపక్ష నేతలు కొత్తగా ప్రజ ప్రభుత్వంపై ఏకైక ఎజెండాగా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు ఎన్ని కష్టాలు ఎదురైన రైతుల పక్షానా నిలబడి తీరుతామని కరెంటు తాగునీటి సమస్యలు తలెత్తకుండా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు గత పదివేల పాపాల చిట్టాలు అసెంబ్లీలో ప్రభుత్వం బహిర్గతం చేస్తే విపక్ష నేతలు ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పై బురద జల్లడమే ఏకైక ఏజెండాగా డ్రైవర్స్ పాలిటిక్స్ చేస్తున్నారని దుయ్యపట్టారు

ఎన్ని కష్టాలు ఎదురైనా రైతుల పక్షన నిలబడి తీరుతమని కరెంటు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సమక్షంలో పక్క ప్రణాళికతో ముందుకు వెళు _న్నామని చెప్పారు





ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ సేవ దళ్ రాష్ట్ర కార్యదర్శి బాగోజీ ముఖేష్ కన్నా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్య, మునిసిపల్ చైర్పర్సన్ సమీశీడ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆడువాలా జ్యోతి లక్ష్మన్, పిసిసి సభ్యులు గిరి నాగభూషణం, ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, సిఎస్సిఎస్ చైర్మన్ దామోదర్ రావు, రాయికల్ ఏఎంసి చైర్మన్ రవీందర్రావు, మైనార్టీ కాంగ్రెస్ నాయకులు పట్టణ అధ్యక్షులు రాజేందర్,జిల్లా కార్యదర్శి భూషణం, మండల కార్యదర్శి రవి, ఉషకోల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

## దేవరగట్టులో ప్రశాంతత కొరకు అరికెర తండాలో పోలీసులు కార్డెన్ సెర్చ్.

**అక్టోబరు 11 (ట్రినెట్ న్యూస్):**
ఆలూరు నియోజకవర్గం పరిధిలోని హోళగుంద మండలం దేవరగట్టు లో వెలసిన శ్రీ శ్రీ మాల మల్లేశ్వర స్వామి బన్నీ ఉత్సవం సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, పత్తికొండ డి.ఎస్.పి వంశీధర్ గౌడ్ ఆదేశాల మేరకు, ఆలూరు సీఐ రవి శంకర్ రెడ్డి పర్యవేక్షణలో ఆలూరు సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది కలిసి ఆలూరు మండలంలోని ఆరికేర తండాలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా గ్రామంలోని ఇళ్లు, కొండ ప్రాంతాలు, గడ్డి వాములు తదితర ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, బన్నీ ఉత్సవం సందర్భంగా ఉపయోగించే రింగ్ కర్రలు, అక్రమంగా తయారు చేస్తున్న







నాటుసారా తదితర వాటిపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తూ, బన్నీ ఉత్సవం సమయంలో ఎవరూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడరాదని, రింగ్ కర్రలతో ఘర్షణలకు దిగరాదని, నాటుసారా తయారీ మరియు విక్రయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఉత్సవాన్నిప్రశాంతవాతావరణంలోజరుపుకోవాలని,శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితేచట్టప్రకారంకఠినచర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి, దేవరగట్టు బన్నీ ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆలూరు సీఐ రవి శంకర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## వానాకాలం 2026 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సన్న రకాల వడ్లను గుర్తించుటకు సాంకేతిక నిపుణులను నియామకం కొరకు ప్రకటన.

**అక్టోబరు 11 (ట్రినెట్ న్యూస్):**
వానాకాలం 2026 మహబూబాద్ జిల్లాలో 230 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించుటకు నిర్ణయించడం జరిగినది. వీటిలో 199 కేంద్రాలను సన్న రకాల కొరకు కేటాయించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఏడు రకాల సన్న వడ్లను వేసిన రైతులకు బోనస్ ప్రకటించిన విషయం విధితమే. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యం ను గుర్తించుటకు ప్రతి కేంద్రంలో ఒక అగ్రికల్చర్ బీఎస్సీ లేదా వ్యవసాయ డిప్లమో చేసిన ఔత్సాహికులకు అవకాశం కల్పించుట జరుగుతున్నది. రెండు నెలల కాలంనకు నెలకు 15000 రూపాయలు గౌరవ భృతి ఇచ్చుటకు నిర్ణయించడమైనది. అగ్రికల్చర్ బీఎస్సీ లేదా అగ్రికల్చర్ డిప్లమో చేసిన యువకులు దరఖాస్తులను మహబూబ్బాద్ కలెక్టరేట్లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమర్పించవలెను. దరఖాస్తు తో పాటు బీఎస్సీ అగ్రికల్చర్ లేదా డిప్లమో సర్టిఫికెట్ జతపరిచి దరఖాస్తు ఇవ్వగలరు. ఆఖరి తేదీ అక్టోబర్ 15 సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9 0 5 9 4 7 4 6 3 4 .

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
సోమవారం , అక్టోబర్,12, 2026
www.trinetnews.com

## సెయింట్ థామస్ ఆల్టిట్యూడ్ స్కూల్ లో రంగురంగుల పూలతో బతుకమ్మ వేడుకలు

**•తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలలో విద్యార్థినులు**

అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సెయింట్ థామస్ ఆల్టిట్యూడ్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. దీంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుష్కారి




కార్తీక్ రావు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. విద్యార్థులకు విద్యాబోధనతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఇలాంటి పండుగల నిర్వహణతో చిన్నారుల్లో ఐకమత్యం, సృజనాత్మకత, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందుతాయని తెలిపారు. మన పండుగల విశిష్టతను భావితరాలకు తెలియజేస్తూ, తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు విద్యార్థినుల్లో ఉత్సాహాన్ని నింపాయని, సంప్రదాయ పండుగలను అందరూ కలిసిమెలిసి జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మర్రి అశోక్ వైస్ ప్రిన్సిపాల్ లింగం మొగిలి వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయినులు సరిత, లావణ్య, ఆశా బేగం, మమత, కవిత, కావ్య, స్వప్న, రమ్య, లలిత, సుమలత, గీత, కళ్యాణి తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థినులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పారు.

## ఇందిరమ్మ ఇళ్లను తమకు కేటాయించాలి : దుగ్గినేపల్లి గ్రామస్తులు.

అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):

-ఎంపీడీవో సంకీర్త్, తహసీల్దార్ రమేష్‌కు బాధితుల వినతి.పినపాక మండలం ,దుగునేపల్లిలోని ఇందిరమ్మ గృహాల్లో గత ఐదేళ్లుగా నివాసం ఉంటున్న తమకు ఆ ఇళ్లను కేటాయించాలని కోరుతూ పలువురు పినపాక ఎంపీడీవో సంకీర్త్, తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రాలు అందజేశారు.

గత ఐదేళ్లుగా తాము ఇందిరమ్మ గృహాల్లో నివసిస్తున్నప్పటికీ, ఆ ఇళ్లలో ఉండేందుకు తమ వద్ద సరైన ఆధారాలు లేవని వినతిపత్రంలో తెలిపారు . ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొంతమంది తమను బెదిరిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో ఏళ్లుగా ఆ ఇళ్లలో నివాసం ఉంటున్న తమ



పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు. తాము నివాసం ఉంటున్న విషయం తెలిసినప్పటికీ కొంతమంది విద్యుత్ కనెక్షన్‌ను సైతం తొలగించారని వారు లేఖలో వివరించారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, నిబంధనల ప్రకారం తమకు ఆ గృహాలను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లుగా ఇళ్లలో నివసిస్తున్న తమకు న్యాయం జరిగేలా అధికారులు స్పందించాలని, బెదిరింపులు, విద్యుత్ కనెక్షన్ తొలగింపు వంటి సమస్యలపై విచారణ జరిపించాలని కోరారు. తమ నివాస పరిస్థితులను పరిశీలించి, అర్హతలను నిర్ధారించి ఇందిరమ్మ గృహాల కేటాయింపుపై తగిన నిర్ణయం తీసుకోవాలని ఎంపీడీవో, తహసీల్దార్‌ను అభ్యర్థించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని అధికారులు వారికి తెలియజేశారు.

## సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా, జవాబుదారితనంతో అమలు చేయాలి,

**•రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల,**

అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):

ప్రజలకు, ప్రభుత్వ పాలనకు సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా అందించడంతో పాటు, ప్రభుత్వ శాఖలలో జవాబుదారితనాన్ని పెంపొందించేలా సమాచార హక్కు చట్టం--2005ను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలు--2026ను పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుభాష్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డి.జి.పి. సి.వి. ఆనంద్, పి.సి.సి.ఎఫ్. వినయ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బెనహర్ మహేష్ దత్, రాష్ట్ర సమాచార కమిషన్ ముఖ్య కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి లతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని అన్ని జిల్లాల సమీకృత కలెక్టరేట్‌లలోని సమావేశ మందిరాల నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాచార హక్కు చట్టంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రజలకు సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికారుల పనితీరులో జవాబుదారితనం పెరుగుతాయని తెలిపారు. చట్టాన్ని సమర్థవంతంగా





అమలు చేయడంతో పాటు, దుర్వినియోగం కాకుండా చూడవలసిన బాధ్యత అధికారులు, పౌర సమాజంపై ఉందని తెలిపారు. చట్టంలోని నిబంధనలను అనుసరిస్తూ, నిర్ణీత గడువులోగా దరఖాస్తులకు సమాధానాలు అందించాలని అధికారులకు సూచించారు. జిల్లా స్థాయిలోనూ సమాచార హక్కు చట్టంపై అవగాహనను పెంపొందిస్తూ, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

అనంతరం సమాచార హక్కు చట్టం--2005ను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అమలు చేస్తూ ప్రజలకు చట్టబద్ధంగా అందించవలసిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందిస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ శాఖలలో సమాచార నిర్వహణను మెరుగుపరచడం, ప్రజలకు సమాచారాన్ని సులభంగా అందుబాటులో ఉంచడం, చట్టం పట్ల ప్రజలలో అవగాహన పెంపొందించడంపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర సమాచార కమిషన్ అందిస్తున్న సేవలు, సమాచార హక్కు చట్టం అమలుకు సంబంధించిన అంశాలను వివరించే 'సమాచార దర్పణం' బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

రాష్ట్రవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి అవార్డులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు,

## గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం : వైద్యులు అనిల్ కుమార్.

11 (ట్రైనెట్ న్యూస్):

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం అందించాలనే లక్ష్యంతో తోగూడెం గ్రామపంచాయతీ పరిధిలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించారు.

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు చిన్నపాటి అనారోగ్య సమస్యలకే దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు లేకుండా, స్థానికంగానే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం ఇటువంటి శిబిరాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు.



ప్రజలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా, సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ పూనెం వెంకటేశ్వర్లు హెల్త్ క్యాంప్‌ను పరిశీలించి, వైద్య సేవల నిర్వహణ తీరును తెలుసుకున్నారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. గ్రామస్థులు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని, అవసరమైనప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలంటే వైద్యశాఖ అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం సమన్వయంతో పనిచేయడం అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు భవిష్యత్తులోనూ అవసరమైన ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## రీ-సర్వే గ్రామాలలో తదుపరి సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి,



**• మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు,**

అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):

రీ-సర్వే గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం తదుపరి చర్యలను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి., డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, తాండూర్, నెన్నెల, భీమిని, వేమనపల్లి మండలాల తహసిల్దార్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి. రాములు, మాట్లాడుతూ రీ-సర్వే గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ అనంతరం తదుపరి చర్యల కార్యాచరణ వేగవంతం చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో మిగిలి ఉన్న పనులను గుర్తించి, సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ తదుపరి సర్వే కార్యకలాపాలను వేగవంతం చేయాలని, ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బడి బతుకమ్మ వేడుకలు.

అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడూళ్ళ బయ్యారంలో బడి బతుకమ్మ పండుగను విద్యార్థినులు, ఉపాధ్యాయుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలతో అం దంగా బతుకమ్మలను పేర్చి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వైభవాన్ని చాటిచెప్పారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో సందడి చేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణం బతుకమ్మ పాటలతో, విద్యార్థినుల సందడితో పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పూల పండుగ బతుకమ్మ విశిష్టతను తెలియజేస్తూ, మన సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల



ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి కొమరం నాగయ్య, పాఠశాల మహిళా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొని విద్యార్థినులను అభినందించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొనడంతో బడి బతుకమ్మ వేడుకలు విజయవంతంగా ముగిశాయి. తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బడి బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

## మండల ప్రజలకు ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):

పినపాక మండల ప్రజలందరికీ ఎంగిలిపూల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రకృతిని పూజిస్తూ, పూలను అందంగా పేర్చి బతుకమ్మను కొలిచే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీక అని తెలిపారు. అదేవిధంగా, దసరా నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పినపాక మండల



ప్రజలందరూ బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకుంటూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

## ఎక్సలెంట్ భాషా హైస్కూల్లో బతుకమ్మ సంబరాలు.

అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,పినపాక మండలం ,బయ్యారం క్రాస్ రోడ్ లో గల ఎక్సలెంట్ భాషా హైస్కూల్ నందు శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఎక్సలెంట్ విద్యాసంస్థల చైర్మన్ యూసఫ్ షరీఫ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. రకరకాల పూలను కోసి తెచ్చి దైవంగా పూజించడమే బతుకమ్మ పండుగ అని అన్నారు. ప్రపంచంలోనే తెలంగాణ రాష్ట్రంలో జరుపుకునే బతుకమ్మ పండుగకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు తీసుకొచ్చిన తంగేడు, తామర, బంతి మొదలగు పూలను ఒకచోట చేర్చి ఉపాధ్యాయినులు బంగారు బతుకమ్మను అందంగా పేర్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి



బతుకమ్మల చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేశారు. డీజే పాటలతో పాఠశాల వాతావరణం కోలాహలంగా మారి పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎక్సలెంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్, డైరెక్టర్లు యాకూబ్ షరీఫ్, ముక్కు నరసారెడ్డి, బండారు నరేంద్ర, ప్రిన్సిపల్ అంకం సురేష్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బయోమెట్రిక్ అప్‌డేట్‌కు అక్టోబర్ 12 డెడ్ లైన్

**-ఎంపీడీఓ సంకీర్త్.**

అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):

పెన్షనర్లకు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకునేందుకు చివరి అవకాశం కల్పించినట్లు పినపాక ఎంపీడీఓ సంకీర్త్ తెలిపారు. శుక్రవారం పినపాక ఎంపీడీఓ కార్యాలయం లో ఆయన మాట్లాడుతూ బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తికాక జూన్, జూలై నెలల నుంచి పెన్షన్ నిలిచిపోయిన వారు, జీవించి ఉన్నట్లయితే సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులతో పాటు, వైకల్యం ఉన్నవారు సదరం సర్టిఫికెట్‌ను జతచేసి ఎంపీడీవో కార్యాలయంలో లేఖ సమర్పించాలన్నారు . ఈ ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు



12-10-2026 వరకు మాత్రమే గడువు ఉన్నట్లు ఇకపై గడువు పొడిగింపు ఉండదన్నారు పెన్షన్ నిలిచిపోయిన అర్హులైన వారు గడువులోగా సంబంధిత కార్యాలయాన్ని సంప్రదించి, అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు.

## వికాస్ టెక్నో స్కూల్‌లో భక్తిశ్రద్ధలతో బతుకమ్మ వేడుకలు



అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):

కల్వకుర్తి మండల కేంద్రంలోని వికాస్ టెక్నో స్కూల్‌లో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని బతుకమ్మ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నారోజు రాఘవాచారి పాల్గొని,బతుకమ్మ పండుగ ఆధ్యాత్మిక విశిష్టతను,ప్రకృతి ఆరాధనలోని అంతరార్థాన్ని,పూలు,మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. బతుకమ్మపండుగతెలంగాణసంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని,ప్రకృతిని దైవస్వరూపంగా భావించిపూజించడంమనసంప్రదాయమనిపేర్కొన్నారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి,బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులైన మహమది,భవానీ,నిహారిక,శ్రీనివాసులు,అపర్ణ,శ్రావణి,రావలక్ష్మి,రాజేశ్వరి,సనా,షబానా,పద్మ, మమత,కృష్ణ,షఫీ,వర్షిత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత సహాయ పరికరాలు

**•అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం**

అక్టోబర్ 11 (త్రినేట్ న్యూస్):



హుస్నాబాద్ నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ( ఏ ఎల్ ఐ ఎం సి ఓ) సహకారంతో ఏ డి ఐ పి పథకం కింద ఉచితంగా సహాయ పరికరాలు అందించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ డా,, బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో సహాయ పరికరాలు అవసరమైన దివ్యాంగులు, వృద్ధులు ఒక్కరు కూడా మిగిలిపోకూడదని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, ట్రైసైకిళ్లు, వాకింగ్ స్టిక్స్, కళ్లద్దాలు, కృత్రిమ అవయవాలు తదితర సహాయ పరికరాలను ఉచితంగా అందించనున్నారు. 80 శాతానికి పైగా వైకల్యం ఉన్న అర్హులకు ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్ల అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.ప్రతి గ్రామంలో అర్హులను గుర్తించాలిఅర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలని మూడు జిల్లాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారులను ( డి డబ్ల్యు ఓ) మంత్రి ఆదేశించారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో సహాయ పరికరాలు అవసరమైన వారిని గుర్తించి, ఎవరూ మిస్ కాకుండా దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో డప్పు చాటింపు ద్వారా కూడా విస్తృత ప్రచారం కల్పించి, అర్హులందరికీ ఈ పథకంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.దరఖాస్తుకు అవసరమైన పత్రాలుఅర్హత కలిగిన వారు యు డి ఐ డి కార్డు లేదా సదరం కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, దివ్యాంగుల పెన్షన్ కార్డు వంటి పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.ఈ నెల 15వ తేదీలోపు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎంపికైన లబ్ధిదారులకు ఈ నెల 27, 28, 29 తేదీల్లో సహాయ పరికరాలను పంపిణీ చేయనున్నారు.మూడు జిల్లాల పరిధిలో ప్రత్యేక పంపిణీ కేంద్రాలుహుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు మూడు జిల్లాల పరిధిలో ఉన్నందున, లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా వేర్వేరు ప్రాంతాల్లో పంపిణీ కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి సూచించారు.సిద్ధిపేట జిల్లా: హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల లబ్ధిదారులకు హుస్నాబాద్ పట్టణంలో.హనుమకొండ జిల్లా: భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల లబ్ధిదారులకు ముల్కనూరులో.కరీంనగర్ జిల్లా: చిగురుమామిడి, సైదాపూర్ మండలాల లబ్ధిదారులకు అందుబాటులో ఉండే ప్రాంతంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి పరికరాలు పంపిణీ చేయనున్నారు.సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామం నుంచి దివ్యాంగులు, వృద్ధులను ప్రత్యేక బస్సుల ద్వారా పంపిణీ కేంద్రాలకు తీసుకువచ్చేందుకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే వారికి భోజన సదుపాయాలతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి, వారికి అవసరమైన సహాయ పరికరాలను అందించడమే లక్ష్యంగా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, మూడు జిల్లాల డీడబ్ల్యూఓలు, రాంగోపాల్ రెడ్డి (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ డిజేబిలిటీ), రవిశంకర్ (జాయింట్ మేనేజర్, ఈడీపీ), రవికృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కారంపూడి ఉర్దూ ఉన్నత పాఠశాలకు 100 ప్లేట్లు, 100 గ్లాసుల వితరణ

**•విద్యార్థుల సౌకర్యార్థం దాత బి. శ్రీనివాసరావు సేవాభావం -- మంత్రి నారా లోకేష్ ప్రశంసా పత్రం**

అక్టోబర్ 11 (త్రినేట్ న్యూస్):



కారంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఉర్దూ) విద్యార్థుల భోజన సౌకర్యార్థం కర్నూలు జిల్లాకు చెందిన బి.శ్రీనివాసరావు 100 భోజన ప్లేట్లు, 100 గ్లాసులను పాఠశాలకు వితరణ చేశారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సహాయం అందించిన శ్రీనివాసరావు సేవలను పాఠశాల యాజమాన్యం అభినందించింది. శ్రీనివాసరావు చేసిన సేవకు గౌరవ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆన్‌లైన్ ద్వారా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆధ్వర్యంలో శ్రీనివాసరావుకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు జే.అనిల్ కుమార్, టి. రవికుమార్ పాల్గొన్నారు. పాఠశాలకు అందించిన సహాయానికి మండల విద్యాశాఖ తరఫున శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి మరింత మంది దాతలు ముందుకు వచ్చి డోనర్ యాప్ ద్వారా తమ వంతు సహకారం అందించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని వారు కోరారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలేటి బిక్షమయ్య మాట్లాడుతూ, పాఠశాలకు సహాయం అందించే ప్రతి దాత పేరు డోనర్ యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నుంచి ప్రశంసలు అందుకున్న శ్రీనివాసరావు తన సేవలను భవిష్యత్తులోనూ పాఠశాలకు కొనసాగించాలని పాఠశాల తరఫున కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మోమిని బి., పాఠశాల సిబ్బంది షేక్ షాహిదాలీ, షేక్ రబ్బాని, షైక్ సత్తార్, అబ్దుల్ సుభాన్, పా మీద బేగం, మునీరా బేగం, అంజలి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ సామాజిక తనిఖీలు పూర్తి, ప్రజా వేదికలో వివరాలు వెల్లడించిన డిఆర్పిలు

**•పారదర్శకతకు పెద్దపీట.. ప్రజలకు వివరించిన అధికారులు**

అక్టోబర్ 11 (త్రినేట్ న్యూస్):





ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం అక్టోబర్ 9: కైకలూరు మండలంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి గ్రామాల్లో 2025-2026- మరియు 2026-2027 నిర్వహించిన సోషల్ ఆడిట్ ప్రక్రియ పూర్తయింది ఈ సందర్భంగా ప్రజా వేదికలో డిఆర్పిలు ఆడిట్లో పరిశీలించిన అంశాలు గుర్తించిన వివరాలు పథకం అమలు తీరుపై ప్రజలకు వివరణ ఇచ్చారు,

గ్రామాల్లో ఉపాధి హామీ పనుల అమలు, కూలీల హాజరు పనుల రికార్డులు, చెల్లింపులకు సంబంధించిన వివరాలను పరిశీలించినట్లు డిఆర్పిలు ప్రజావేదికలో వివరించారు

పథకంలో పారదర్శకతను పెంపొందించడం నిధులు సక్రమంగా వినియోగించేలా చూడడం శ్రామికులకు న్యాయం జరిగేలా పర్యవేక్షించడం సోషల్ ఆడిట్ ప్రధాన ఉద్దేశం అని సంబంధిత అధికారులు పేర్కొన్నారు ఆడిట్లో గుర్తించిన అంశాలపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కైకలూరు మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారి రామకృష్ణ డ్రైనేజీ డి ఈ సామాజిక తనిఖీ అధికారులు డిస్టిక్ విజిలెన్స్ ఆఫీసర్ పురుషోత్తం, ప్రోసిడింగ్ ఆఫీసర్ రాజశేఖర్, ఏపీ డి నిర్మల జ్యోతి, ఎంపీడీవో అప్పారావు, ఎస్ ఆర్ పి సత్యనారాయణ ఏపీఓ శరణ్ కుమార్, డిఆర్పిలు ధనలక్ష్మి, పుల్లారావు, మహేష్, పుల్లయ్య, గంగాధర్ రావు, మీన, రమేష్, మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు

# బీసీ హాస్టల్ విద్యార్థులకు రూ.2.50 లక్షల విలువైన పరుపులు, దిండ్లు, బెడ్‌షీట్లు వితరణ

**•మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**

అక్టోబర్ 11 (త్రినేట్ న్యూస్):





విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని బీసీ కాలేజ్ బాలుర వసతి గృహంలో విద్యార్థుల సౌకర్యార్థం రూ. 2.50 లక్షల విలువైన పరుపులు, దిండ్లు, బెడ్‌షీట్లను పంపిణీ చేశారు.ఇటీవల రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుమారుడు మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి జన్మదినం సందర్భంగా బీసీ కాలేజ్ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు అవసరమైన పరుపులు, దిండ్లు, బెడ్‌షీట్లు అందించాలని కోరగా, వారి విజ్ఞప్తి మేరకు మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ఈ కార్యక్రమానికి ముందుకొచ్చింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించిన వస్తువులను హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులతో కలిసి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు తమ వంతు సహకారంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సమాజం పట్ల సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో కష్టపడి చదవాలని సూచించారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో కీలకమని, విద్యారంగంలో కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.....

# దసరా ఉత్సవాల్లో బందోబస్తుకు ఏర్పాట్లు...

అక్టోబర్ 11 (త్రినేట్ న్యూస్):



మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో ఆదివారం నుంచి నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు మంత్రులతో పాటు జిల్లాలోని ఏడుగురు ఎమ్మెల్యే వచ్చే అవకాశం ఉందని దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు అన్నారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తున్న దసరా ఏర్పాట్లలో భాగంగా ఆయన ఎస్.ఐ కొండపల్లి సురేష్‌బాబుతో పాటు పోలీసు బందోబస్తు నిర్వహించే ఏర్పాట్లపై చర్చించారు. అమ్మవారి సన్నిధిలో భక్తుల మానసికోల్లాసానికి నిర్వహించే సాంస్కతిక ప్రదర్శనల వద్ద కావలసిన పోలీసు బందోబస్తుతో దుర్గాష్టమికి అంబరాన్నంటే సంబరాల్లో కావలసిన బందోబస్తుపై కూడా వారిరువురు చర్చించారు.

# ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ పార్టీ సభకు అనుమతి ఇవ్వకపోవడం పై ఎమర్జెన్సీ ని తలపిస్తున్నాడని ఖండించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి

అక్టోబర్ 11 (త్రినేట్ న్యూస్):



దేశ రాజధాని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటు చేసే సభకు అనుమతి ఇవ్వక ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎమర్జెన్సీ తలపిస్తున్నాడని మాజీ మంత్రి బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి జీవన్ రెడ్డి ఖండించారు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు మాట్లాడే హక్కు ఉంది దాన్ని కాలరాయడం ప్రధానమంత్రి కి తగదనిఈ విధంగా చేయడం గతంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినట్లు లాగా ఢిల్లీని ప్రధానమంత్రి ఆధీనంలోకి తీసుకున్నాడని ఇది పద్ధతి కాదని దీని వ్యతిరేకిస్తున్నామని జీవన్ రెడ్డి అన్నారు సభలో సమావేశాలు నిర్వహించుకునే అధికారం ఉందని ప్రభుత్వం ఇలా చేయడం బాగాలేదని దీన్ని మేము ఖండిస్తున్నాం అని జీవన్ రెడ్డి అన్నారు ఇది ఇలా ఉండగా ప్రజలు విద్యావేత్తలు రాజకీయ నాయకులు భారతదేశ పౌరులు కాక్రోచ్ పార్టీని పూర్తిగా నిషేధించాలని, ఉక్కు పాదంతో అణిచివేయాలని దేశాన్ని విచ్చినం చేసే శక్తులను ఉక్కు పాదంతో అనచివేయాలని కాక్రోచ్ పార్టీని పూర్తిగా బహిష్కరించి, వెంటనే అరెస్టు చేసి భారత రాజ్యాంగం ప్రకారం వారి శిక్షలు వేయాలని దేశాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు

# మైతాపూర్‌కొడిమ్యాల సుజిత్ కుమార్కు 60 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కును అందచేసిన మాజీ ఎంపీటీసీ గోపిరాజ రెడ్డి



అక్టోబర్ 11 (త్రినేట్ న్యూస్):

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మహితపూర్ గ్రామములో కొడిమ్యాల సుజిత్ కుమార్ కి ఆరోగ్యం బాగా లేనందున చికిత్స చేయించు కొని హాస్పిటల్ బిల్లుల కొరకు మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆశ్రయించగా వారి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిది దరఖాస్తు చేయగా అట్టి చికిత్స ఖర్చు ల నిమిత్తం సుజిత్ కుమార్ కు మంజూరు అయిన అరువది వేల రూపాయల మంజూరు అయిన సహాయ నిధి చెక్కును మాజీ ఎంపీటీసీ సభ్యులు గోపి రాజారెడ్డి అందచేశారుఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి కి కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు

ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ గోపి రాజారెడ్డి స్థానిక వార్డ్ సభ్యులు బుస గంగ మల్లయ్య రాయికల్ పట్టణ ఆర్య సంఘం అధ్యక్షులు గంప ఆనందం కొడిమ్యాల శ్రీనివాస్ అంజి తదితరులు పాల్గొన్నారు

# ఇటిక్యాల గ్రామ సేవా సమితి నూతనంగా ఎన్నికైన అభివృద్ధి కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన దావసంత సురేష్





అక్టోబర్ 11 (త్రినేట్ న్యూస్):

జగిత్యాల,రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ సేవ సమితి అభివృద్ధినూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్షులు ప్రతాపు రెడ్డి ఉపాధ్యక్షులు రొట్టె శ్రీనివాస్ కోశాధికారి రాజు కుమార్ మరియు కమిటీ సభ్యులు జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ని మర్యాదపూర్వకంగా కాలువగా నూతన కార్యవర్గ సభ్యులకు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి విష్ణు తదితరులు పాల్గొన్నారు

# నిరుపేదలకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో12 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు





అక్టోబర్ 11 (త్రినేట్ న్యూస్):

జగిత్యాల పట్టణంలోని పావని కంటి ఆసుపత్రిలో రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 12 మంది నిరుపేదలకు ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారుఈ సేవా కార్యక్రమంలో జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొని నిరుపేదలకు కంటి శస్త్రచికిత్సలు చేసారు.అనంతరం శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు, అవసరమైన మందులను పంపిణీ చేశారు. నిరుపేదలకు కంటి చూపును అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, రోటరీ క్లబ్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జయ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డిని ఆహ్వానించిన నిర్వాహకులు

అక్టోబర్ 11 (త్రినేట్ న్యూస్):



జగిత్యాల పట్టణం జయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న 15 వ పంచదశ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు జగిత్యాల మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ని నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించారు

ఈ సందర్భంగా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని మాజీమంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి కి అందజేశారు.అనంతరం జయదుర్గా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ..దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించేలా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జయదుర్గా సేవా సమితి నిర్వాహకులు ముసిపట్ల లక్ష్మీనారాయణ, దాసరి దామోదర్, నలువాల శ్రీకాంత్, బిట్టు, గాదె కార్తీక్, అలిశెట్టి కిషన్, సింగారావు, నడిపి గంగారాం, తిరుపురం రాంచందర్, ద్యావనపెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మనసును వినాలి.. మార్పును తెవాలి!

### -తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. మోతుకూరి రాంచందర్




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:**

మానసిక ఆరోగ్య పరిరక్షణకు బాధలో ఉన్నవారి మాటలను శ్రద్ధగా వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, అవసరమైన సహాయం అందించడం ఎంతో ముఖ్యమని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. మోతుకూరి రాంచందర్ పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టీపీఏ) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఆధ్వర్యంలో నారాయణగూడలోని సత్యనారాయణ రెడ్డి భవన్లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీఏ రాష్ట్ర అధ్యక్షులు, డా. మోతుకూరి రాంచందర్ మాట్లాడుతూ, మానసిక ఆరోగ్య సమస్యలను అనుభవించిన వ్యక్తుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు, వారి అనుభవాల ఆధారంగా సేవలు, చికిత్సా విధానాలు, విధానపరమైన నిర్ణయాల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల్లో పరీక్షల ఒత్తిడి, మార్కులపై ఆందోళన, కుటుంబ అంచనాలు, ఉద్యోగ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సంబంధాలు మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల మార్కులకే కాకుండా వారి భావోద్వేగ ఆరోగ్యానికీ ప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాలలు, కళాశాలల్లో కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తరించాలని కోరారు. .గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలని, జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం, టెలి-మానస్ వంటి సేవలపై ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. మానసిక సహాయం అవసరమైనవారు టెలి-మానస్ ఉచిత సహాయవాణి 14416 ను సంప్రదించవచ్చని చెప్పారు.

కార్యక్రమంలో టీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. సుధాకర్, రాష్ట్ర కోశాధికారి డా. శ్రీపూజ, ఉపాధ్యక్షులు అలియా పర్వీన్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాజు ఆచార్య, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి సునయన, రాష్ట్ర నాయకులు ప్రశాంతి, అన్నత్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రణయ్ మీసాల, దేదీప్య, రోజా, పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి కోసం ఎదురుచూపులు

**హైదరాబాద్, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):**

సొంత ఇల్లు లేకపోయినా సర్వే రికార్డుల్లో ఇంటి యజమానిగా నమోదు చేయడంతో ఇందిరమ్మ ఇల్లు పథకానికి దూరమవుతున్నామని చారకొండ మండలం జేపల్లి గ్రామానికి చెందిన మల్లెపాకుల పద్మ, ఆమె భర్త సైదులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ వాస్తవ పరిస్థితిని పరిశీలించి, రికార్డుల్లో వివరాలను సరిచేసి ఇల్లు మంజూరు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన ఇద్దరు తమ్ముళ్లు కొన్నేళ్ల క్రితం తమ సొంత డబ్బులతో ఇళ్లు నిర్మించుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తాను ఇల్లు నిర్మించుకోలేక తమ్ముళ్ల ఇంటి వద్ద తాత్కాలికంగా ఉంటున్నట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో తమ్ముళ్ల ఇంటి ముందు తమ ఫొటో తీయవద్దని చెప్పినప్పటికీ, సర్వే సిబ్బంది ఫొటో తీసి తమను ఎల్3 జాబితాలో ఇంటి యజమానులుగా నమోదు చేశారని ఆరోపించారు.

ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో తమ పేరు ఎల్3 జాబితాలో ఉండటంతో అనర్హులుగా చూపుతున్నారని పద్మ పేర్కొన్నారు. తమ్ముళ్ల ఇంటిపై తమకు యాజమాన్య హక్కు లేదని అధికారులకు వివరించినా సమస్య పరిష్కారం కావడం లేదని వాపోయారు.



కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదు

ఈ విషయమై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని పద్మ తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఇంటి యాజమాన్య వివరాలను పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

“మాకు సొంత ఇల్లు లేకపోయినా ఉన్నట్లు నమోదు చేయడంతో పథకానికి దూరమవుతున్నాం. రికార్డుల్లో జరిగిన తప్పిదంతో మేమెందుకు నష్టపోవాలి?” అని బాధిత దంపతులు ప్రశ్నించారు.

సంబంధిత అధికారులు తమ ఫిర్యాదుపై స్పందించి, సర్వేలో నమోదైన వివరాలను పునఃపరిశీలించాలని కోరారు. ఎల్3లో ఉన్న తమ పేరును ఎల్1 జాబితాలో చేర్చి, అర్హత మేరకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి న్యాయం చేయాలని పద్మ, సైదులు విజ్ఞప్తి చేశారు.

## గార్డ్స్, ఇన్నర్వీల్ ఆధ్వర్యంలో బాలిక దినోత్సవం



**చిలకలూరిపేట , ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:**

చిలకలూరిపేట : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) మరియు ఇన్నర్వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం జరిగింది. ఇన్నర్వీల్ క్లబ్ అధ్యక్షురాలు తోటకూర రామసీత ముక్య అతిథిగా హాజరై మాట్లాడారు. గార్డ్స్ అధ్యక్షురాలు దాసరి ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముక్య అతిథి రామసీత మాట్లాడుతూ రేపటి ప్రపంచానికి బలమైన ప్రతినిధులు బాలికలే అన్నారు. నేడు అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నారని, వంటింటి నుండి అంతరిక్షం దాకా అన్ని విషయాలలో ప్రపంచాన్ని శాసిస్తున్నారన్నారు. బాలికలు యుక్త వయసు వచ్చేదాక అప్రమత్తంగా ఉండాలని , ఎదురయ్యే ప్రలోభాలకు లొంగకుండా, లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని అనుకున్నది సాధించాలన్నారు. పట్టుదల కృషితో అనేక మంది బాలికల్లో బాల్యంలోనే లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకుని అయ్యే ఎస్, ఐపీఎస్ అయిన వారు కళ్ళ ఎదుటే కోకొల్లలుగా ఉన్నారన్నారన్నారు. ఇందులో భాగంగా విద్యార్థునులకు జనవిజ్ఞాన వేదిక ప్రచురించిన ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గార్డ్స్ కార్యదర్శి పొనుగుబాటి బుల్లిబాబు, దాసరి చిట్టిబాబు, సి ఆర్ కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ తోటకూర వెంకటనారాయణ, సాహితీ విమర్శకులు డా.పివి సుబ్బరావు, డా.చుక్కా విన్సెంట్ పాల్, జెవివి అధ్యక్ష కార్యదర్శులు ధూళిపాళ వెంకట్రావు, బొంత అజయ్ బాబు, ప్రచురణల విభాగం రాష్ట్ర కన్వీనర్ డా.దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయ ఇంచార్జ్ డి.వీర్రాజు , వివిధ పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని గెలిపించండి

**-గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**
**-జనసైనికుల త్యాగాలకు తగిన గుర్తింపు ఇవ్వాలి**
**-స్థానిక ఎన్నికల్లో జన సైనికులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి**
**-గిరిజన గ్రామాల అభివృద్ధిని గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది**
**-ప్రజా అవసరాలను విస్మరించి.. పార్టీ రంగుల కోసం వందల కోట్ల ఖర్చు చేసింది**
**-రాజకీయాలకు అతీతంగా గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా నిధుల కేటాయించాము**
**-రహదారులు, ఉపాధి, వైద్య సదుపాయాల మెరుగుదలకు చర్యలు తీసుకున్నాం**
**-అడవితల్లి బాట 2.0 ద్వారా రూ.2,052 కోట్లతో 2,569 పనులకు శ్రీకారం**
**--ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్**



**అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు అండగా నిలిచి, కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. కూటమిలోని అన్ని పార్టీల నాయకులు, జన సైనికులు, వీరమహిళలు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగుతూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. కూటమి ఏర్పాటు, విజయం కోసం జనసేన పార్టీ, జనసైనికులు ఎన్నో త్యాగాలు చేశారని, వారి త్యాగాలను గుర్తిస్తూ పొత్తు ధర్మానికి అనుగుణంగా స్థానిక సంస్థల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరాడామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం, కూటమి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం లభించేలా కూటమిలోని ప్రతి నాయకుడు అండగా నిలవాలని కోరారు. ఆదివారం పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కాకవాడలో అడవితల్లి బాట 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, “2014లో కూటమికి మద్దతుగా నిలిచినప్పుడు ఏ ఒక్క జనసైనికుడు పదవులూ ఆశించలేదు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని భావించి నిస్వార్థంగా పని చేశారు. పార్టీ కోసం, కూటమి కోసం తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి ఎన్నో త్యాగాలు చేశారు. నారా చంద్రబాబు నాయుడు గారి అరెస్టు సమయంలో కూడా జనసైనికులు, వీరమహిళలు రోడ్లపైకి వచ్చి తమ సంఘీభావాన్ని చాటారు. కష్టకాలంలో అండగా నిలిచిన వారి త్యాగాలను మనం ఎప్పటికీ మర్చిపోకూడదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ జనసైనికులు, వీరమహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. వారి త్యాగాలకు తగిన గౌరవం లభించాలి. పదవులు ఆశించకుండా అండగా నిలిచిన వారి నమ్మకాన్ని మనం నిలబెట్టుకోవాలి.

**అడవితల్లి బాట లక్ష్యం అదే**

గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయాలు కల్పించి, వాటిని అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ‘అడవితల్లి బాట’ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. రహదారుల నిర్మాణం ద్వారా గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, రవాణా, మార్కెట్ సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నాం. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పీఎం-జన్మన్, పీఎంజీఎస్వై-4, ఉపాధి హామీ పథకాల సమన్వయంతో ‘అడవితల్లి బాట’ కార్యక్రమాన్ని ప్రారంభించాం. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, పోలవరం, శ్రీకాకుళం, విజయనగరం, నంద్యాల, ఏలూరు జిల్లాల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఈ కార్యక్రమం కింద 858 గిరిజన ఆవాసాలకు 1,662 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి రూ. 1,406 కోట్లతో పనులు చేపట్టాం. ఇదే స్ఫూర్తితో అడవితల్లి బాట 2.0 ద్వారా మరో 1,341 ఆవాసాలకు 1,976 కిలోమీటర్ల మేర రహదారులు, 45 వంతెనల నిర్మాణం కోసం రూ. 2,052 కోట్లతో మొత్తం 2,569 పనులను మంజూరు చేశాం. 2018లో చేపట్టిన పోరాట యాత్ర సందర్భంగా ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంతాల్లోని అనేక గిరిజన గ్రామాలను సందర్శించి, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి ఎంత దూరంగా ఉన్నాయో అర్థం చేసుకున్నానని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాం అని అన్నారు. అయితే, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం సాధారణ గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే ఎంతో క్లిష్టమైన ప్రక్రియ. కొండల మధ్య కిలోమీటర్ల మేర మార్గాలను ఏర్పాటు చేయడంతోపాటు, భారీ బండరాళ్లను తొలగించాలన్నారు.

అవసరమైన చోట రాక్ కట్టింగ్, కంట్రోల్ బ్లాస్టింగ్ చేపట్టాలి. కొండ వాలులను స్థిరపరిచి, రహదారికి పటిష్ఠమైన పునాది వేసిన తర్వాత గ్రావెల్, ఇతర పొరలను ఏర్పాటు చేసి బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉంటుందని చెప్పారు.

**83 వేల మంది రైతులకు లబ్ధి**

గిరిజన కుటుంబాలకు స్థిరమైన ఆదాయాన్ని కల్పించి, వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఉద్యానవనాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉపాధి హామీ, వీబీ-జీ రామ్ జీ పథకాల ద్వారా గిరిజన ప్రాంతాల్లో 85 వేల ఎకరాల్లో ఉద్యానవనాలను అభివృద్ధి చేసి, సుమారు 83 వేల మంది రైతులకు లబ్ధి చేకూర్చాం అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కాఫీ సాగును ప్రోత్సహించడంతో పాటు, కాఫీ తోటలకు నీడనిచ్చే సిల్వర్ ఓక్ వంటి మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం అని వివరించారు. అలాగే, గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాన్ని అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాం అని పవన్ కళ్యాణ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు సుంకరమెట్ట కాఫీ తోటల్లో వుడెన్ బ్రిడ్జి, కానోపీ వాక్లను నిర్మించాం అన్నారు. మారేడుమిల్లిలో 11 హెక్టార్ల విస్తీర్ణంలో అరోమా కానోపీ వాక్, ట్రెక్కింగ్ వంటి కార్యకలాపాల ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నాం అని తెలిపారు. నల్లమలలో జంగిల్ సఫారీని అభివృద్ధి చేయడం ద్వారా చెంచు గిరిజన కుటుంబాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పించడంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని విమర్శించారు. ప్రజల అవసరాల కోసం ఖర్చు చేయాల్సిన నిధులను శిలాఫలకాల ఏర్పాటు కోసం, ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీ రంగులు వేయడం కోసం, కోర్టుల ఆదేశాల తర్వాత ఆ రంగులను తొలగించి మళ్లీ కొత్త రంగులు వేయడం కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అహంకారంతో ప్రజలను భయపెట్టే పరిస్థితులు ఉండకూడదు. తప్పును ప్రశ్నించే ధైర్యం ప్రజలకు ఉండాలి. అదే సమయంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను కూడా గుర్తించాలి. ధైర్యంగా ఉండాలి, బాధ్యతగా వ్యవహరించాలి, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి” డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.

## ఓటు హక్కు కోల్పోయిన బాధితులను మీ ముందుకు తీసుకొస్తా..

### తేదీ, సమయం చెప్పండి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:**

ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కుకు అన్యాయం జరగకూడదని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఓటు హక్కు కోల్పోయిన బాధితులు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు ఆయన సవాల్ విసిరారు. ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందుతున్న బాధితులను, వారి ఆధారాలతో సహా తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని, అందుకు తేదీ, సమయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణలో ఏవైనా తప్పులు జరిగితే వాటిని సరిదిద్దేందుకు అన్ని పార్టీలు సహకరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు బీజేపీ కార్యకర్తలు కూడా భాగస్వాములు కావాలని రామచంద్రరావు పిలుపునిస్తే ప్రజాస్వామ్యానికి మేలు జరిగేదని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణపై జరుగుతున్న ఆందోళనలను తప్పుబడుతూ, ఓటు హక్కు కోల్పోయిన వారు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించడం సరికాదని వ్యాఖ్యానించారు.

**బాధితులను ఆధారాలతో సహా తీసుకొస్తా**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తన సవాల్ను స్వీకరించి తేదీ, సమయం ప్రకటించాలని మంత్రి కోరారు. పోలీసు బలగాలను వినియోగించి అరెస్టులు చేయించడం కాకుండా, ఓటు హక్కు కోల్పోయినట్లు చెబుతున్న బాధితుల సమస్యలను పరిశీలించాలని సూచించారు. ఆధారాలతో సహా బాధితులను తన ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు. తన ఓటు విషయంలోనూ సమస్య ఎదురైందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. తన తండ్రి పేరు సత్తయ్య, సత్యనారాయణ గౌడ్ వంటి పేర్లలో ఉన్న వ్యత్యాసాలను సాకుగా చూపి, ఆధారాలు చూపించకపోతే తన ఓటును తొలగించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఇలాంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ



న్యాయం జరగాలని అన్నారు.

**ఓట్ల తొలగింపుపై స్పష్టత ఇవ్వాలి**

దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు, రాష్ట్ర రాజధానిలో 40 లక్షల ఓట్లు, తెలంగాణలో 70 లక్షల ఓట్లు సవరణ పేరుతో తొలగిపోయాయని మంత్రి ఆరోపించారు. ఓటర్ల జాబితాలో ఎన్ని ఓట్లు తొలగించారు? వాటిలో అనర్హులైనవారి ఓట్లు ఎన్ని? అర్హులైన ఓటర్ల పేర్లు పొరపాటున తొలగించబడ్డాయా? అనే అంశాలపై స్పష్టమైన వివరాలు ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఎన్నికల రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్లపై ఆరోపణలు**

బీజేపీకి వ్యతిరేకంగా ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ఓట్లు తొలగించబడ్డాయని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదలు, వృద్ధులు, నిరక్షరాస్యులు, రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఆధార్ వంటి గుర్తింపు పత్రాలు ఉన్నప్పటికీ ఇతర ఆధారాలు సమర్పించాలని కోరితే సామాన్య ప్రజలు తమ హక్కును ఎలా కాపాడుకోవాలో ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఓటరు నమోదు, ఆధారాల సమర్పణకు సంబంధించిన అంశాలపై ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను కూడా పరిశీలించాలని మంత్రి పేర్కొన్నారు. ప్రముఖులకే ఓటరు నమోదు, గుర్తింపు పత్రాల సమర్పణ విషయంలో ఇబ్బందులు ఎదురైతే సామాన్యుల పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నికల వ్యవస్థ తేలికగా తీసుకోకూడదని అన్నారు. ఓటు హక్కు అనేది కేవలం గుర్తింపు మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్యంలో పౌరుల భాగస్వామ్యానికి కీలకమైన హక్కు అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరిదిద్దాలని, అయితే ఆ ప్రక్రియలో అర్హులైన పౌరులు తమ ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని స్పష్టం చేశారు.

**‘ఓటు బచావో -- దేశ్ బచావో’ నినాదంతో ఉద్యమం**

ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రశ్నించే వారిని అవమానించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి అన్నారు. స్వతంత్ర భారతదేశంలో ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడటం ఆందోళనకరమని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా తన హక్కును కోల్పోకూడదన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ఓటు బచావో -- దేశ్ బచావో, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి -- రాజ్యాంగాన్ని కాపాడండి”లిలి అనే నినాదంతో ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో పారదర్శకతకు చర్యలు తీసుకోవాలని, ఓటు హక్కు కోల్పోయినట్లు చెబుతున్న బాధితులకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

# సత్యదేవ్, రమ్య కృష్ణ, ఫరియా అబ్దుల్లా, శరత్ మరార్, నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ 'ట్రయల్ అండ్ ఎర్రర్' పూజా కార్యక్రమంతో ఘనంగా ప్రారంభం








**అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):**
నిర్మాత శరత్ మరార్ నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సత్యదేవ్, ఫరియా అబ్దుల్లా, రమ్యకృష్ణ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సిరీస్ 'ట్రయల్ అండ్ ఎర్రర్' సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కమల్ హాసన్ నటించిన స్టైలిష్ థ్రిల్లర్ 'చీకటి రాజ్యం'కు దర్శకత్వం వహించిన రాజేష్ సెల్వ ఈ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. విభిన్నమైన పాత్రల్లో తనదైన నటనతో ఆకట్టుకునే సత్యదేవ్.. ఈ సిరీస్ లో ఛాలెంజింగ్ క్యారెక్టర్ చేస్తున్నారు. ఇందులో రమ్యకృష్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. తనదైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో కథకు మరింత ఇంటెన్సిటీ తీసుకురానున్నారు. ఫరియా అబ్దుల్లా కూడా ఈ ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. ఈ సిరీస్‌లో విరాజ్ అశ్విన్, చైతన్య కృష్ణ, వర్ష బొల్లమ్మ, యష్ పూరి, సంపత్ రాజ్, సుబ్బరాజు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణంలో, రాజేష్ సెల్వ దర్శకత్వంలో రూపొందుతున్న 'ట్రయల్ అండ్ ఎర్రర్'.. ప్రతిభావంతులైన నటీనటుల కలయికతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.నటీనటులు: సత్యదేవ్, రమ్యకృష్ణ, ఫరియా అబ్దుల్లా, విరాజ్ అశ్విన్, చైతన్య కృష్ణ, వర్ష బొల్లమ్మ, యష్ పూరి, సంపత్ రాజ్, సుబ్బరాజు

సాంకేతిక బృందం:
నిర్మాత: శరత్ మరార్
బ్యానర్: నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్
రచన, దర్శకత్వం: రాజేష్ సెల్వ
పీఆర్వో: వంశీ–శేఖర్

# మహాశక్తి' ఆలయంలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం తొలిరోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారి దర్శనం



**కరీంనగర్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:**
కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో విజయ దశమి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. ఆలయాన్ని పూలతో సుందరంగా ముస్తాబు చేశారు. నవరాత్రుల తొలిరోజున అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి (శైలపుత్రి) రూపంలో సూర్యప్రభ అలకంరణ చేశారు. బాలా త్రిపుర సుందరీ దేవి అవతారం శక్తి, జ్ఞానం, ధైర్యం, నిర్మలత్వానికి ప్రతీక. శరన్నవరాత్రుల ఆరంభంలో ఈ బాలరూపాన్ని ఆరాధించడం ద్వారా దైవభక్తితోపాటు మంచి విలువలను జీవితంలో ఆచరించాలనేది సందేశం. బాలా త్రిపుర సుందరీ దేవి ఆరాధన మనిషిలోని నిర్మలత్వాన్ని మేల్కొలిపి, జ్ఞానమార్గంలో నడిపిస్తుందని భక్తుల విశ్వాసం. దుర్గమ్మ అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమివ్వడం భక్తులకు కనువిందు చేసింది. తొలిరోజు వేలాది భక్తులతో శ్రీ మహాశక్తి దేవాలయం కిటకిటలాడింది. ఉదయం 11 గంటలకు ధ్వజరోహణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాన్ని దర్శించుకున్న వేలాది మంది భక్తులు, ముఖ్యంగా భవానీ దీక్షాపరులకు ఆలయ నిర్వాహకులు మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందించారు. నవరాత్రులు ముగిసే వరకు భోజనం, అల్పాహారం అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.మరోవైపు ఈరోజు నుండి నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజు సాయంత్రం బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ 'శ్రీ భాగవత వైభవం'పై ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్న ఆలయ నిర్వాహకులు తెలిపారు. అట్లాగే ప్రతిరోజు రాత్రి 9 గంటలకు అధ్యాత్మిక భావన, భక్తి పాటలతో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా "దాండియా" కార్యక్రమం నిర్వహించనున్నారు.

# కాంగ్రెస్ రాజకీయ నిరాశ బయటపడింది: బీజేపీ ఢిల్లీలో జనసమీకరణకు ఇతర రాష్ట్రాల కార్యకర్తలా?: ఎన్.వి. సుభాష్

**హైదరాబాద్, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):**
సుప్రీంకోర్టు వైపు సోమవారం నిర్వహించనున్న మార్చ్ కోసం కాంగ్రెస్ ఇతర రాష్ట్రాల నుంచి కార్యకర్తలను తరలిస్తోందని తెలంగాణ బీజేపీ విమర్శించింది. అత్యున్నత న్యాయస్థానాన్ని ముట్టడించాలన్న రాహుల్ గాంధీ పిలుపు న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నమా అని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి. సుభాష్ ప్రశ్నించారు.
ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో దశాబ్దాలపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ దేశ రాజధానిలో పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించలేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతిపాదిత నిరసన కోసం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సుమారు 60 మంది పార్టీ సభ్యులతో న్యూఢిల్లీకి వెళ్తున్నట్లు వచ్చిన మీడియా కథనాలను ప్రస్తావించారు.
దేశ స్వాతంత్ర్య సాధనకు నాయకత్వం వహించామని, ఆరు దశాబ్దాలకు పైగా దేశాన్ని పాలించామని చెప్పుకునే పార్టీ, ఢిల్లీలో నిరసనకు ఇతర రాష్ట్రాల నుంచి కార్యకర్తలను తీసుకురావాల్సి రావడం విడ్డూరమని సుభాష్ వ్యాఖ్యానించారు.
ఇటీవల కాంగ్రెస్, ఇండియా కూటమి మిత్రపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి మార్చ్ చేపట్టేందుకు చేసిన ప్రయత్నాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఆకాశవాణి భవన్ వద్ద భద్రతా సిబ్బందితో రాహుల్ గాంధీ ఘర్షణకు దిగారని ఆరోపించారు. పోలీసులతో తోపులాటలు జరిగినట్లు వచ్చిన వార్తలు మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయని పేర్కొన్నారు.
వివాదాస్పద అంశాలపై పార్లమెంట్‌లో చర్చించడానికి బదులుగా వీధుల్లో ఘర్షణ వాతావరణాన్ని సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని సుభాష్ ఆరోపించారు. ఇకపై సమస్యలను పార్లమెంట్‌లో కాకుండా వీధుల్లో తేల్చుకుంటామన్న సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్ వ్యాఖ్యలుగా వచ్చిన కథనాలను ప్రస్తావిస్తూ, ఇటువంటి వైఖరి రాజ్యాంగ సంస్థల పట్ల గౌరవంపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు.
"ఇది రాజ్యాంగం కంటే వీధి పోరాటానికే ప్రాధాన్యం ఇచ్చే ధోరణి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో చర్చలకు, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణకు నిర్దిష్ట వేదికలు ఉన్నాయి. రాజ్యాంగ సంస్థలపై ఒత్తిడి తెచ్చే సాధనాలుగా నిరసనలను మార్చకూడదు" అని ఆయన పేర్కొన్నారు.
ఢిల్లీ పోలీసులు విధించిన ఆంక్షలకు సంబంధించిన అంశాలను సుప్రీంకోర్టు ఇప్పటికే పరిశీలిస్తున్న సమయంలో, న్యాయస్థానం వైపు మార్చ్ నిర్వహించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. న్యాయస్థాన వ్యాఖ్యలపై చర్చించవచ్చని, అయితే నిరసనలు న్యాయ విచారణను ప్రభావితం చేసే ప్రయత్నాలుగా భావించే పరిస్థితి రాకూడదని అన్నారు.
బీజేపీ మద్దతుదారులను రాహుల్ గాంధీ పదేపదే 'అంధ భక్తులు'గా విమర్శించడాన్ని సుభాష్ తప్పుబట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలన, విధానాలపై విశ్వాసం ఉంచేవారిని అలా కొట్టిపారేయలేమన్నారు. కాంగ్రెస్ తన సంస్థాగత బలాన్ని, రాజకీయ విధానాన్ని సమీక్షించుకోవాలని సూచించారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి చర్చ, జవాబుదారీతనం, సంస్థల పట్ల గౌరవం అవసరమని పేర్కొన్నారు.

# నార్వే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో 'దహిణి ది విచ్' చిత్రానికి గాను జేడీ చక్రవర్తికి ఉత్తమ నటుడు పురస్కారం

**అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):**
విలక్షణ నటుడు జేడీ చక్రవర్తి నటించిన 'దహిణి ది విచ్' చిత్రానికి మరో అంతర్జాతీయ పురస్కారం లభించింది. కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు ధీటుగా నిర్వహించే నార్వే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో 'దహిణి ది విచ్' చిత్రానికి గాను జేడీ చక్రవర్తికి ఉత్తమ నటుడు పురస్కారం లభించింది. ప్రపంచవ్యాప్తంగా 150 నామినేషన్స్ రాగా బెస్ట్ లీడ్ యాక్టర్ కేటగిరీలో జేడీ చక్రవర్తికి ఈ అవార్డ్ రావడం గొప్ప విషయం.ఇప్పటికే ఎన్నో ఫిలిం ఫెస్టివల్స్ లో ఈ చిత్రం అనేక అవార్డ్స్ ను కైవసం చేసుకుంది. తాజాగా నార్వే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో 'దహిణి' ఉత్తమ చిత్రం అవార్డ్ ను సైతం దక్కించుకుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ప్రముఖ నటులు ఈ నామినేషన్ లో ఉండగ భారతీయ నటుడు జేడీ చక్రవర్తి కి ఈ అవార్డ్ దక్కడం గర్వించదగ్గ విషయం. ఈ సందర్భంగా
జేడి చక్రవర్తి మాట్లాడుతూ .. 'ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన హేమాహేమీలు రూపొందించిన



చిత్రాలతో పోటీపడి 'దహిణి' ఉత్తమ చిత్రం అవార్డ్ దక్కించుకోవడం భారతీయ చలనచిత్ర పరిశ్రమ కి గర్వ కారణం , అలానే దాదాపు 150 నామినేషన్లలో వరల్డ్ వైడ్ నటులు ఉండగా , బెస్ట్ లీడ్ యాక్టర్ అవార్డ్ నన్ను వరించడం నన్నెంతో ఆనందానికి గురి చేసింది. ఇలాంటి చిత్రాలు చాలా అరుదుగా వస్తుంటాయి, నన్ను నమ్మి ఈ క్యారెక్టర్ ను నా కిచ్చిన దర్శకుడు రాజేష్ టచ్ రివర్ కి, అలానే నార్వే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ నిర్వాహకులకు నా కృతజ్ఞతలు తెలుపుతున్నా' అని అన్నారు.
ఇంతకుముందు ఈ సినిమా అంతర్జాతీయ స్థాయిలో



పలు గౌరవాలు దక్కించుకుంది. ఆస్ట్రేలియా టైటాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, పసిఫిక్ బీచ్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్, స్వీడిష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ఎకో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్లో ఈ చిత్రం దాదాపు 18 అంతర్జాతీయ అవార్డులను కైవసం చేసుకుని రికార్డు సృష్టించింది. రాజేష్ టచ్ రివర్ దర్శకత్వం వహించిన 'దహిణి ది విచ్' సినిమాలో జేడీ చక్రవర్తితోపాటు.. తనిష్ట ఛటర్జీ, శ్రుతి జయన్ కీలకపాత్రలలో నటించారు. సునీతా కృష్ణన్, ప్రదీప్ నారాయణన్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించారు.

# 'కాస్ట్' టీజర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. సినిమా సూపర్ డూపర్ హిట్ కావాలని కోరుకుంటున్నాను: టీజర్ లాంచ్ ఈవెంట్ లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):**
వరుణ్ సందేశ్, గగన్ బాబు, సత్యం రాజేష్, రవి సోషల్ డ్రామా 'కాస్ట్'(ఝుర్వ) ఇంటెన్స్ అండ్ గ్రిప్పింగ్ టీజర్ లాంచ్
వరుణ్ సందేశ్, గగన్ బాబు , సత్యం రాజేశ్, రవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సోషల్ డ్రామా 'కాస్ట్'. ఏకే జంపన్న రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు.కశిక కపూర్, దివి వద్యా కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఆసక్తిని పెంచిన చిత్ర బృందం తాజాగా ఇంటెన్స్ అండ్ గ్రిప్పింగ్ టీజర్‌ను లాంచ్ చేసింది.కుల వివక్ష అనే ప్రధాన ఇతివృత్తాన్ని




పరిచయం చేస్తూ టీజర్ ప్రారంభమవుతుంది. అగ్రకులానికి చెందిన వారి ఇంట్లోకి తమకు ప్రవేశం లేదని ఓ తండ్రి తన కొడుకుకు చెప్పే సన్నివేశంతో కథలోని సామాజిక అంశాన్ని పరిచయం చేశారు. ఆ తర్వాత కుల వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించే ఓ పోలీస్ అధికారి పాత్రను చూపించారు. గ్రామంలో వరుసగా జరిగే దారుణ హత్యలతో కథ మరింత ఉత్కంఠభరితంగా మారుతుంది. వరుణ్ సందేశ్, సత్యం రాజేశ్, నాగబాబు, రాజా రవీంద్ర, యాంకర్ రవి, దివి వద్యా పోషిస్తున్న కీలక పాత్రల తాలూకు గ్లింప్స్ టీజర్‌లో ఆకట్టుకున్నాయి.దర్శకుడు ఏకే జంపన్న సున్నితమైన సామాజిక అంశాన్ని ఎంచుకుని, దానికి డ్రామా జోడిస్తూఆసక్తికరమైనసోషల్ థ్రిల్లర్‌గా తెరకెక్కించినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. కథను ముందుకు నడిపించడంలో ప్రతి పాత్రకూ ప్రాధాన్యం ఉన్నట్లు కనిపిస్తోంది.వరుణ్ సందేశ్ తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకోగా, పోలీస్ అధికారి పాత్రలో గగన్ బాబు పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. సత్యం రాజేశ్ తన పాత్రతో ఆసక్తిని

# విశాఖలో పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లపై పోలీసుల ప్రత్యేక తనిఖీలు లైసెన్సుల ఉల్లంఘనలు, అధిక ధరల వసూళ్లపై ఆరా.. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక

**విశాఖపట్నం, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:**
నగరంలో పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లలో నిబంధనల ఉల్లంఘనలను అరికట్టడం, ప్రజల భద్రతను పరిరక్షించడమే లక్ష్యంగా విశాఖ సిటీ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్ ఆదేశాల మేరకు అక్టోబర్ 10 రాత్రి నగరవ్యాప్తంగా ఏకకాలంలో ఈ తనిఖీలు చేపట్టారు. మొత్తం 93 మంది పోలీసు సిబ్బందితో 31 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వివిధ పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించారు.

**పలు నిబంధనల ఉల్లంఘనలు గుర్తింపు**
ఈ తనిఖీల్లో పలు సంస్థల్లో వివిధ నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా మద్యం విక్రయాల్లో గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే కొన్ని సంస్థల్లో ఫుడ్, ట్రేడ్, లేబర్ లైసెన్సులు లేకపోవడం, వాణిజ్య వంటశాలల్లో గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్లను ఉపయోగించడం వంటి



అంశాలను పరిశీలించారు.
మరికొన్నిసంస్థల్లోఅగ్నిమాపక భద్రతకు సంబంధించిన అనుమతులు లేకపోవడం, పార్కింగ్ సౌకర్యాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. అనుమతించిన సమయంముగిసినప్పటికీకార్యకలాపాలుకొనసాగిస్తున్న సంస్థలపైనా పోలీసులు దృష్టి సారించారు.

**నిబంధనలు పాటించాల్సిందే**
తనిఖీలసందర్భంగాగుర్తించినలోపాలనుసరిదిద్దుకోవాలని సంబంధిత సంస్థల యాజమాన్యాలకు పోలీసులు సూచించారు. లైసెన్సు నిబంధనలు, భద్రతా ప్రమాణాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా విభాగాలకు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

**సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి**
నగరంలో అక్రమ కార్యకలాపాలను నియంత్రించడం, పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లలో ప్రజల భద్రతను నిర్ధారించడం ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశమని విశాఖ సిటీ పోలీసులు స్పష్టం చేశారు. ఎక్కడైనా అక్రమ కార్యకలాపాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఫిర్యాదులు, సమాచారాన్ని అందించేందుకు నగర పోలీస్ కమిషనర్ వ్యక్తిగత నంబర్ 7995095799ను సంప్రదించవచ్చని తెలిపారు. సమాచారం అందించే వారి వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచుతామని విశాఖ సిటీ పోలీసులు పేర్కొన్నారు.

# విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):**
విద్యార్థులు చిన్ననాటి నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో కూడిన పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు. నరసరావుపేట పట్టణ పరిధిలోని లింగంగుంట శంకరభారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మానవతా సొసైటీ ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు విద్యార్థులకు స్వయంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ విద్యే అత్యంత విలువైన ఆస్తి, పేదరికం ఏ విద్యార్థి చదువుకూ ఆటంకం కాకూడదు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఏ విషయంలోనూ తక్కువ కాదని, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా రాణించే ప్రతిభ మన గ్రామీణ ప్రాంత పిల్లల్లో పుష్కలంగా ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు ఇలాంటి స్టడీ మెటీరియల్ పరీక్షల సమయంలో ఎంతో మేలు చేస్తుందని, దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు




తీసుకురావాలని సూచించారు. సమాజంలో ఆర్థికంగా ఉన్నవారు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి పేద విద్యార్థులకు పుస్తకాలు, ఉపకార వేతనాలు, విద్యా సామగ్రి అందించి తోడ్పాటునందించడం ఎంతో ప్రశంసనీయమని చెప్పారు. విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, బాధ్యతాయుతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మానవతా సొసైటీ ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థుల విద్యా వనరుల కల్పనకు, పాఠశాలల అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,



ఉపాధ్యాయ బృందం, మానవతా సొసైటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల కోసం ప్రెస్ క్లబ్ కార్యాచరణ ప్రణాళిక




హైదరాబాద్, అక్టోబర్ 11:
జర్నలిస్టులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు, వారి సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమాజిగూడ లో ఆదివారం నాడు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు ఎస్. విజయకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రెస్ క్లబ్ సీనియర్ జర్నలిస్టులు, సభ్యులు హాజరయ్యారు. ఏడాది కాలంలో మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యులకు సర్వసభ్య సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ప్రెస్ క్లబ్ స్థలం లీజు వెంటనే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రెస్ క్లబ్ ఏజీఎం ఏకగ్రీవంగా తీర్మానించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని దీనికోసం అన్ని జర్నలిస్టు సంఘాలను, యూనియన్లను కలుపుకొని కార్యాచరణ ప్రణాళిక అమలు చేసేందుకు కార్యవర్గం తీర్మానం ఆమోదించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, వయోధిక పాత్రికేయులకు పెన్షన్లను ఇవ్వాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ప్రెస్ క్లబ్ ఏజీఎం తీర్మానించింది. ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ.రాజేష్, అరుణ అత్తలూరి, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్ , వర్ధెల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు ముత్యాల సత్తిబాబు, ఎం. రమాదేవి, రచన ముడుంబై, వనం.నాగరాజు, ఎన్. శ్రీనివాస్ రెడ్డి, అమిత్ బట్టు, అశోక్ దయ్యాల, రాజేశ్వరి కల్యాణం, శంకర్ శిగ సర్వసభ సమావేశంలో పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టులు దేవులపల్లి అమర్, ఆర్ .శైలేష్ రెడ్డి, దిలీప్ రెడ్డి, రవి కాంత్ రెడ్డి సహా యూసుఫ్ బాబు తదితరులు హాజరయ్యారు. మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యుడి కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సహాయం తక్షణం అందజేయాలని ప్రెస్ క్లబ్ సర్వసభ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టు నాయకులు దేవులపల్లి అమర్ ను ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి శాలువతో సత్కరించింది.

# ఐఐటీఎం పుణెలో యువ పరిశోధకుల వర్క్‌షాప్
## ఎస్టిక్ సదస్సుకు సన్నాహక కార్యక్రమం




న్యూఢిల్లీ, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):
పుణెలోని భారత ఉష్ణమండల వాతావరణ శాస్త్ర సంస్థ (ఐఐటీఎం) ఆదివారం మేఘదూత్ హాల్‌లో ప్రారంభ దశ పరిశోధకుల కోసం 'ఏపీఏఆర్‌సీ ఎర్లీ కెరీర్ వర్క్‌షాప్' నిర్వహించింది. 'ది ఈసీఆర్ నెక్సస్: పరిశోధకుల స్వరాలు, సాధనాలు, విజ్ఞానాన్ని సమాజంతో అనుసంధానించడం' అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమం, రాబోయే 'ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్' (ఎస్టిక్)కు సన్నాహక వేదికగా నిలిచింది.
కార్యక్రమంలో కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ టి. శ్రీనివాస కుమార్ ప్రధాన ప్రసంగం చేశారు. ఎస్టిక్ సదస్సు దార్శనికతను, వ్యూహాత్మక లక్ష్యాలను వివరించారు. భారతదేశ భవిష్యత్ అభివృద్ధికి విజ్ఞానం, సాంకేతికత, విధానాల సమన్వయం కీలకమని పేర్కొన్నారు. పరిశోధన,ఆవిష్కరణలకు బలమైన అనుకూల వాతావరణాన్ని నిర్మించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.కీలక శాస్త్రీయ రంగాల్లో పురోగతిని సాధించడంతోపాటు పరిశోధకులు, విధాన రూపకర్తలు, పరిశ్రమల ప్రతినిధులు కలిసి పనిచేసేందుకు వేదికలను ఏర్పాటు చేయడంలో మంత్రిత్వ శాఖ నిబద్ధతను ఆయన వివరించారు. నూతన సాంకేతిక విజయాలనుసుస్థిరజాతీయఅభివృద్ధికిఉపయోగించుకోవాలని సంబంధితవర్గాలకుపిలుపునిచ్చారు.విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో పరివర్తనాత్మక కార్యక్రమాలపై విస్తృత చర్చలకు ఎస్టిక్ వేదిక కానుందని ఈ సన్నాహక కార్యక్రమం స్పష్టం చేసింది.

# గుడిసె లేని తెలంగాణ నిర్మాణమే ఇందిరమ్మ రాజ్య లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
## రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేసి నల్లగొండ జిల్లా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం



నల్లగొండ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:
గుడిసె లేని తెలంగాణ నిర్మాణమే ఇందిరమ్మ రాజ్య లక్ష్యమని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పాలనకు ప్రాధాన్యత ఇస్తోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు అందించడంతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.
ప్రజా ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్న బియ్యాన్ని ముఖ్యమంత్రి, తాను కూడా తింటున్నామని మంత్రి చెప్పారు. గతంలో కేసీఆర్, కేటీఆర్ సన్న బియ్యం తింటూ ప్రజలకు దొడ్డు బియ్యం పెట్టేవారని విమర్శించారు.

**ఎల్‌నినోతో కరువు పరిస్థితులు**
ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, వర్షాలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి పేర్కొన్నారు. మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన తనకు రైతుల కష్టాలు తెలుసని అన్నారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అధికారులతో చర్చించి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం**
గత పదేళ్లలో కేసీఆర్‌కు కుర్చీపై ఉన్న ధ్యాస తప్ప ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న శ్రద్ధ లేదని మంత్రి విమర్శించారు. అప్పట్లో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. గతంలో రాజశేఖర్ రెడ్డి హయాంలో పులిచింతల ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు మూడో పంటకు నీటిని తరలిస్తున్న సమయంలో తాను అడ్డుకున్నానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గుర్తుచేశారు.

**రెండేళ్లలో సొరంగం పూర్తి చేస్తాం**
రాబోయే రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని పూర్తి చేసి నల్లగొండ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కృష్ణా నది జలాలతో నల్లగొండ జిల్లా ప్రజల కాళ్లు తడుపుతానని మాట ఇస్తున్నానన్నారు. జిల్లా రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. నీటి లభ్యత, ప్రాజెక్టుల నిర్మాణం, సాగునీటి అవసరాలపై అధికారులతో చర్చించి రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# చిన్నపిల్లల గుండె సమస్యలకు ఉచిత వైద్య శిబిరం
## అక్టోబర్ 16న నరసరావుపేటలో ఆంధ్ర హాస్పిటల్స్, మహేష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ



నరసరావుపేట,ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:
పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో చిన్నపిల్లల గుండె సంబంధిత సమస్యలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 16వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆంధ్ర హాస్పిటల్స్, మహేష్ బాబు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక రామిరెడ్డిపేటలోని హీరో కృష్ణ--మహేష్ బాబు అభిమాన సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శిబిరానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ శిబిరంలో ఆంధ్ర హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు డాక్టర్ డి. లింగస్వామి పాల్గొని, చిన్నారులకు గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించనున్నారు.పుట్టిన శిశువుల నుంచి 15 సంవత్సరాల వయస్సు వరకు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. గుండె ఆపరేషన్లు అవసరమైన చిన్నారులకు తగిన వైద్య సహాయం అందించేందుకు ఈ శిబిరం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి నెల మూడో శుక్రవారం స్థానిక పల్నాడు రోడ్డులోని నాగసరపు రామారావు కాంప్లెక్స్ వెనుక సందులో ఉన్న శ్రీ త్రికోటేశ్వర స్కాన్ సెంటర్‌లో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ--మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షుడు ఎం.డి. ఫారూఖ్ బాబు, అభిమాన సంఘం సభ్యులు సీహెచ్. చిన్నికృష్ణ, డి. నాగేశ్వరరావు, మన్నేపల్లి శ్రీను, ఎస్.కె. బాజీ, ఎస్.కె. సుభాని, ఎస్.కె. షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ 3 రోజుల స్పెయిన్ పర్యటన
## ఏపీ పర్యాటకరంగానికి గ్లోబల్ గుర్తింపు లభించేలా మంత్రి దుర్గేష్ ప్రత్యేక కృషి



అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:
రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మూడు రోజుల స్పెయిన్ పర్యటన విజయవంతంగా ముగిసింది. రాష్ట్రంలో పర్యాటకరంగాన్నిపునరుద్ధరించడానికిఅంతర్జాతీయ పెట్టుబడులనుఆకర్షించడానికి,నూతనసాంకేతికతల ను ప్రవేశపెట్టడానికి మంత్రి దుర్గేష్ ఈ పర్యటనలో చేసినకృషివిశేషప్రశంసలు పొందింది.స్పెయిన్‌లోని సెవిల్లె నగరంలో జరిగిన ప్రతిష్ఠాత్మక 'టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్-2026' లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని చేసిన ప్రసంగం, ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది.. గ్లోబల్ టూరిజం ట్రెండ్స్, స్మార్ట్ డెస్టినేషన్స్, సుస్థిర పర్యాటక విధానాలపై పర్యాటక నిపుణులతో మంత్రిదుర్గేష్‌సుదీర్ఘంగా చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా రూపుదిద్దుకున్న వినూత్న మోడల్'NiVUAI(NeuralIntelligenceVernacular Unified Model) ను మంత్రి దుర్గేష్ ప్రపంచవేదికపైఆవిష్కరించారు.'Explurger' సంస్థ సహకారంతో ఏపీలోని 100కు పైగా ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలలో పర్యాటకులకు తమ సొంత భాషలోనే సమాచారం అందించేలా ఈ సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగాస్పెయిన్‌కు చెందిన పలు అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పర్యాటక సంస్థలతో మంత్రి దుర్గేష్ నేరుగా సమావేశమయ్యారు. సుదీర్ఘ తీరప్రాంతంలో వెల్‌నెస్ సెంటర్లు, టెంపుల్ టూరిజం, ఎకో-టూరిజం, రిసార్టుల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. సమ్మిట్‌లో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. మీరు ఇప్పటికే భారతదేశాన్ని చూశామని భావిస్తే.. ఒక్కసారి ఆంధ్రప్రదేశ్ వచ్చి చూడండి, మేము మిమ్మల్ని ఖచ్చితంగా ఆశ్చర్యపరుస్తాం"లి అని పిలుపునివ్వడం గ్లోబల్ డెలిగేట్లను విశేషంగా ఆకట్టుకుంది. పర్యటన అనంతరం విజయవాడ చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ స్పెయిన్ పర్యటన ద్వారా లభించిన అనుభవాలు, ఆధునిక సాంకేతికత, అంతర్జాతీయ పెట్టుబడుల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.. మీ సందర్భంగా స్పెయిన్ లో తనకు లభించిన ఆతిథ్యం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.

# 'ఇంద్ర--2026' విన్యాసాల కోసం రష్యాకు చేరుకున్న ఐఎన్ఎస్ సహ్యాద్రి



న్యూఢిల్లీ, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):
భారత నౌకాదళం, రష్యా నౌకాదళం సంయుక్తంగా నిర్వహించనున్న 'ఇంద్ర--2026' ద్వైపాక్షిక నౌకా విన్యాసాల్లో పాల్గొనేందుకు భారత యుద్ధనౌక ఐఎన్ఎస్ సహ్యాద్రి అక్టోబర్ 10న రష్యాలోని వ్లాదివోస్తోక్‌కు చేరుకుంది. అక్టోబర్ 13 నుంచి 18 వరకు జరగనున్న ఈ విన్యాసాలు ఇరు దేశాల నౌకాదళాల మధ్య వృత్తిపరమైన అనుభవాల మార్పిడి, సముద్ర కార్యకలాపాల్లో సమన్వయం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నాయి.భారత ప్రభుత్వం ప్రతిపాదించిన 'మహాసాగర్' (ప్రాంతాల మధ్య భద్రత, అభివృద్ధి కోసం పరస్పర, సమగ్ర పురోగతి) దార్శనికతకు అనుగుణంగా ఐఎన్ఎస్ సహ్యాద్రి ఈ విన్యాసాల్లో పాల్గొంటోంది. భారత్--రష్యా మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న రక్షణ, సముద్ర భాగస్వామ్యాన్ని ఈ పర్యటన మరింత పటిష్ఠం చేయనుంది. 2025 డిసెంబర్ 4--5 తేదీల్లో జరిగిన 23వ భారత్--రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సు ద్వారా సాధించిన పురోగతిని ముందుకు తీసుకెళ్లేందుకు కూడా ఇది అవకాశం కల్పిస్తుంది.
'ఇంద్ర--2026' విన్యాసాలు తొలుత నౌకాశ్రయ దశలో ప్రారంభమై, అనంతరం సముద్రంలో సమన్వయంతో నిర్వహించే కార్యకలాపాలతో కొనసాగనున్నాయి. ఇరు నౌకాదళాల మధ్య పరస్పర అవగాహన, కార్యాచరణ సమన్వయం, కలిసి పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు వృత్తిపరమైనసమావేశాలు,వివిధనౌకావిన్యాసాలు నిర్వహించనున్నారు.విన్యాసాలతోపాటు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరగనున్నాయి. వీటి ద్వారా ఇరు దేశాల నౌకాదళ సిబ్బంది పరస్పరం కలుసుకుని స్నేహబంధాలను బలోపేతం చేసుకోవడంతోపాటు ప్రజల మధ్య సంబంధాలను మరింతపెంపొందించుకునేఅవకాశ లభించనుంది.

# వికసిత్ భారత్‌కు యువతే చోదకశక్తి: ప్రధాని మోదీ
## చెన్నైలో జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయ స్వర్ణోత్సవాల్లో ప్రధాని



చెన్నై, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):
యువతలోని ఉత్సాహం, ప్రతిభ, ఆత్మవిశ్వాసం భారతదేశ భవిష్యత్తుపై అపారమైన నమ్మకాన్ని కలిగిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తమిళనాడులోని చెన్నైలో జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూల్ స్వర్ణోత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.
నవరాత్రుల తొలి రోజున శివశక్తుల పవిత్ర నేలను సందర్శించడం ఆనందంగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. విద్యార్థుల్లో కనిపిస్తున్న సానుకూల శక్తి, ఉత్సాహం పండుగకు శుభారంభాన్ని అందించాయని అన్నారు. "మీ అందరి కళ్లలో భారతదేశ భవిష్యత్తు కనిపిస్తోంది" అని వ్యాఖ్యానించారు.
వికసిత్ భారత్ లక్ష్యాన్ని ముందుకు నడిపించే శక్తిగా ఎదగాలని నేటి యువత ఆకాంక్షిస్తోందని మోదీ అన్నారు. ఈ లక్ష్యసాధనకు అవసరమైన వినూత్న ఆలోచనలు, పరిష్కారాలు భారత్‌తోపాటు ప్రపంచ భవిష్యత్తును కూడా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు అందించే సామర్థ్యం భారత యువతకు ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో విస్తరిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

**ఏడుగురు విద్యార్థులతో ప్రారంభమై.. 15 సంస్థలకు విస్తరణ**
విశ్వ హిందూ విద్యా కేంద్రం 1975లో చెన్నైలోని వెస్ట్ మాంబళంలో కేవలం ఏడుగురు విద్యార్థులతో, పరిమిత వనరులతో ప్రారంభమైందని ప్రధాని గుర్తుచేశారు. ఆధునిక సౌకర్యాలు, సొంత భవనం లేకపోయినా వ్యవస్థాపకుల సంకల్పం, సేవాభావంతో సంస్థ అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం తమిళనాడులోని వివిధ ప్రాంతాల్లో 15 విద్యాసంస్థలకు విస్తరించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.
పాఠశాల భవన నిర్మాణానికి సహకరించిన జైగోపాల్ గరోడియా సేవలను స్మరించారు. సంస్థ విజయప్రస్థానంలో భాగస్వాములైన ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. యాభై ఏళ్ల ఈ ప్రయాణం అంకితభావానికి, నిబద్ధతకు, యువ జీవితాలను తీర్చిదిద్దే కృషికి నిదర్శనమని అన్నారు. కొన్ని నెలల క్రితం నాగర్‌కోయిల్‌లో గిరిజా అమ్మను, పలువురు పిల్లలను కలుసుకున్న సందర్భాన్ని ప్రధాని గుర్తుచేశారు. దేశ భవిష్యత్తుపై ఆమెకున్న అంకితభావం, ఆత్మవిశ్వాసం తనను ప్రభావితం చేశాయని చెప్పారు. ఆ సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం స్వర్ణోత్సవాలకు హాజరైనట్లు తెలిపారు.
సైనికుల కోసం రోజుకు ఒక్క రూపాయి పొదుపు చేయాలని గిరిజా అమ్మ విద్యార్థులను ప్రోత్సహించిన విషయాన్ని 'మన్ కీ బాత్'లో ప్రస్తావించానని మోదీ చెప్పారు. వేలాది మంది పిల్లలు కలిసి రూ.40 లక్షలు సమకూర్చడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు సహాయం చేయడం, స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి సేవల ద్వారా విద్యాలయం విద్యార్థుల్లో విలువలను పెంపొందిస్తోందని ప్రశంసించారు.

**నేర్చుకున్న జ్ఞానాన్ని జీవితంలో ఆచరించాలి**
మహనీయుడు తిరువళ్లువర్ బోధనలు విద్యార్థులకు ఎంతో అవసరమని ప్రధాని అన్నారు. ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు 'తిరుక్కురళ్' రష్యన్ అనువాదాన్ని అందించినట్లు తెలిపారు. జీవితాంతం కొత్త విషయాలు నేర్చుకోవాలనుకునే వారికి తిరుక్కురళ్ గొప్ప మార్గదర్శకమని పేర్కొన్నారు. నేర్చుకోవడంతోపాటు ఆ జ్ఞానాన్ని జీవితంలో ఆచరించడం కూడా ముఖ్యమనే తిరువళ్లువర్ సందేశాన్ని విద్యార్థులు అనుసరించాలని సూచించారు.
మహాకవి సుబ్రహ్మణ్య భారతి ఆలోచనలపై కాశీలోని ఆధ్యాత్మికత, జాతీయ చైతన్యం ప్రభావం చూపాయని మోదీ అన్నారు. ఆయన జీవితాన్ని, భావజాలాన్ని అధ్యయనం చేయాలని విద్యార్థులను కోరారు. భారతి ఇచ్చిన 'అచ్చమిల్లై.. అచ్చమిల్లై' అంటే 'భయం లేదు.. భయం లేదు' అనే సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని పెద్ద కలలు కనాలని, భిన్నంగా ఆలోచించాలని, నిర్భయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
దేశవ్యాప్తంగా పర్యటించడం ద్వారా భారత వైవిధ్యాన్ని అర్థం చేసుకున్నానని ప్రధాని తెలిపారు. 1990వ దశకం ప్రారంభంలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సాగిన ఏక్తా యాత్రలో గిరిజా అమ్మతో పరిచయం ఏర్పడిందని గుర్తుచేశారు. తమిళ భాష, సంస్కృతిపై తనకున్న ప్రేమకు ఈ అనుభవాలు కూడా కారణమని అన్నారు. విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి, తమిళ కవిత్వం, కథలు, సంప్రదాయాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. భిన్న నేపథ్యాలకు చెందిన వారితో ఏర్పడే స్నేహాలు జాతీయ ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

**విద్య, క్రీడల్లో విస్తరిస్తున్న అవకాశాలు**
దేశ విద్యారంగంలో విస్తృత మార్పులు జరుగుతున్నాయని ప్రధాని అన్నారు. 2014లో 750గా ఉన్న విశ్వవిద్యాలయాల సంఖ్య ప్రస్తుతం 1,300కు పైగా పెరిగిందని, కళాశాలల సంఖ్య 38 వేల నుంచి 52 వేలకు పైగా చేరిందని తెలిపారు. కొత్త ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఐటీలు, ఎయిమ్స్ సంస్థల ఏర్పాటుతో విద్యార్థులకు అవకాశాలు పెరిగాయని పేర్కొన్నారు.
నూతన విద్యా విధానంతో విద్య నాణ్యత మెరుగుపడుతోందని మోదీ అన్నారు. 2015లో క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో 14 భారత విశ్వవిద్యాలయాలు ఉండగా, తాజా ర్యాంకింగ్స్‌లో వాటి సంఖ్య 52కు చేరిందని తెలిపారు. విద్యాసంస్థలు పెరగడం విద్యార్థులకు మరిన్ని ఎంపికలు, అవకాశాలను అందిస్తోందన్నారు.
క్రీడలను వృత్తిగా ఎంచుకోవాలనుకునే యువతకు మెరుగైన శిక్షణ, మౌలిక సదుపాయాలు, సహకారం అందిస్తున్నామని ప్రధాని చెప్పారు. 2030 కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సన్నద్ధమవుతోందని, 2036 ఒలింపిక్స్‌ను నిర్వహించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. యువ క్రీడాకారులు దేశాన్ని అంతర్జాతీయ క్రీడారంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.
ప్రసంగం ముగింపులో విద్యార్థులతో కలిసి "మనం సాధిస్తాం" అంటూ ప్రధాని సంకల్పం చేయించారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణం, ప్రపంచంలోని తొలి మూడు ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ను నిలపడం, స్వావలంబనతో ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగడం, ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడం, చంద్రుడిపై భారతీయుడు అడుగుపెట్టడం వంటి లక్ష్యాల సాధనకు యువత అంకితం కావాలని పిలుపునిచ్చారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి -పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ఖమ్మం, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:
ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో సాగునీటితో పాటు తాగునీటి అవసరాలను తీర్చడం కూడా సవాలుగా మారే అవకాశం ఉందని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులకు ఎలాగైనా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయంలో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు యాసంగి పంటలు సాగు చేయవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోందని పొంగులేటి తెలిపారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను కొంతవరకు అధిగమించవచ్చని అన్నారు. వ్యవసాయ అవసరాలతో పాటు ప్రజల తాగునీటి అవసరాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇదే సమయంలో విద్యుత్ వినియోగంపైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మేరకే విద్యుత్‌ను ఉపయోగిస్తూ పొదుపు పాటించాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీరు.. విద్యుత్‌ను బాధ్యతాయుతంగా వినియోగించడం అందరి బాధ్యత అని మంత్రి పొంగులేటి చెప్పారు.

# 'అగ్ని గవాక్షం' కవితా సంపుటి ఆవిష్కరణ

**హైదరాబాద్, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):** హరీష్ కుమార్ శర్మ రచించిన 'అగ్ని గవాక్షం' కవితా సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సాహితీ కళాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, సినీ గేయరచయిత మౌనశ్రీ మల్లిక్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీవేత్త దాస్యం సేనాధిపతి సభకు అధ్యక్షత వహించారు. సాహితీవేత్త శైలజామిత్ర, రచయిత హరీష్ కుమార్ శర్మ అక్క, బావ అయిన త్రివేణి, రవీంద్ర తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రచయిత హరీష్ కుమార్ శర్మ



తన కవితా సంపుటిని సభకు పరిచయం చేశారు.

# బహుజన తెలంగాణ కోసం బతుకమ్మ మరో ఉద్యమ స్వరూపం కావాలి: కవిత

## ఉస్మానియాకు రూ.1,000 కోట్లు సాధించే వరకు పోరాడుతాం

**ఈవీఎంలు తొలగించి బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలి**









**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:** బహుజన తెలంగాణ నిర్మాణం కోసం బతుకమ్మ మరోసారి ఉద్యమ స్వరూపం దాల్చాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పేదింటి బిడ్డలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కల్పించాలని, యూనివర్సిటీలు నాయకులను తయారు చేసే ఫ్యాక్టరీలుగా మారాలని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ కీలక స్ఫూర్తిగా నిలిచిందని, ఇప్పుడు సమానత్వం, స్వేచ్ఛ, అన్ని వర్గాలకు అధికారంలో ప్రాతినిధ్యం కల్పించేందుకు మరోసారి ఉద్యమ సాధనంగా మారాలని కవిత అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణ ఉద్యమానికి కేంద్రంగా నిలిచిందని గుర్తుచేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ. 1,000 కోట్లు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించి ఆరు నెలలు గడిచినా నిధులు విడుదల కాలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి నుంచి ఆ నిధులను ముక్కుపిండి అయినా సాధిస్తామని అన్నారు. యూనివర్సిటీల్లో అధ్యాపకుల కొరత, హాస్టళ్లలో కనీస సౌకర్యాల లేమిపై ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేశాయని పేర్కొంటూ, గతంలో బీఆర్ఎస్‌లో భాగస్వామిగా ఉన్నందుకు మరోసారి క్షమాపణలు చెబుతున్నానన్నారు. ఎన్నికల వ్యవస్థ మారాలిచీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను మార్చడం మాత్రమే పరిష్కారం కాదని, మొత్తం ఎన్నికల వ్యవస్థలో మార్పులు రావాలని కవిత అన్నారు. ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, యువత నాయకులుగా ఎదిగేందుకు యూనివర్సిటీలు వేదికలు కావాలని సూచించారు. రాహుల్ గాంధీ ప్రకటించిన రోహిత్ వేముల చట్టం, జాబ్ క్యాలెండర్ హామీల అమలుపై కూడా ప్రశ్నించారు. విద్యార్థులు ఫాలోవర్లుగా కాకుండా నాయకులుగా ఎదగాలని, పేద కుటుంబాల పిల్లలకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించేలా యూనివర్సిటీల్లో స్వేచ్ఛాయుత ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వాలని కవిత పిలుపునిచ్చారు.

# దుర్గా స్వరోత్సవ్‌లో శాస్త్రీయ సంగీతం, నృత్యాలకు ఘన వేదిక



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 11:** పాట్నా: భారతీయ శాస్త్రీయ సంగీతం, నృత్య సంప్రదాయాలను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన మూడు రోజుల దుర్గా స్వరోత్సవ్ అక్టోబర్ 11న ముగిసింది. అక్టోబర్ 9 నుంచి 11 వరకు పాట్నాలోని రవీంద్ర భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హిందుస్థానీ శాస్త్రీయ సంగీతం, భరతనాట్యం, పురులియా ఛౌ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ గాయకుడు పండిట్ సజన్ మిశ్రా సంగీత ప్రదర్శనతో ఉత్సవం ప్రారంభమైంది. సంప్రదాయ కళలను ఆధునిక తరానికి పరిచయం చేయడంతోపాటు యువతలో భారతీయ సంగీతం, నృత్యాలపై ఆసక్తిని పెంపొందించడమే ఇలాంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం. కళాకారులకు ప్రదర్శన వేదికలు కల్పించడం ద్వారా దేశ సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించవచ్చని









# రవీంద్రభారతిలో సందడిగా అటుకుల బతుకమ్మ వేడుకలు

## రెండో రోజు ఆడిపాడిన మహిళలు, దివ్యాంగులు, చిన్నారులు













**హైదరాబాద్, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు రెండో రోజు ఆదివారం రవీంద్రభారతిలో సందడిగా సాగాయి. అటుకుల బతుకమ్మ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూతిరుగుతూపాటలుపాడి ఆడిపాడారు.జాతీయ అవార్డు గ్రహీత పద్మావతి నేతృత్వంలోని దివ్యాంగుల బృందం ఉత్సాహంగా పాల్గొంది. అలేఖ్య సంస్థ ఆధ్వర్యంలో సుమారు వంద మంది మహిళలు, విద్యార్థులు, చిన్నారులు బతుకమ్మ పాటలు, నృత్యాలతో సందడి చేశారు. మహిళలు, దివ్యాంగులు, కళాకారుల భాగస్వామ్యం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని కార్యక్రమ ప్రతినిధులు పేర్కొన్నారు. పూలను పూజిస్తూ, ప్రకృతిని ప్రేమిస్తూ జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెబుతుందన్నారు.కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు పి. నర్సింహులు, పరిపాలన అధికారి డాక్టర్ పి. విజయకుమార్, సూపరింటెండెంట్ జె. శ్రీనివాస్, హేమలత, సాంస్కృతిక సలహా మండలి సభ్యులు ముచర్ల దినకర్, పల్లె నర్సింహా, శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలుగువారి జీవనాడి కూచిపూడి

## తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొలేటి దామోదర గుప్తా

**హైదరాబాద్, అక్టోబర్ 11 (ట్రైనెట్ న్యూస్):** కూచిపూడి తెలుగువారి జీవనాడి అని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొలేటి దామోదర గుప్తా అన్నారు. ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు, పద్మభూషణ్ వెంపటి చినసత్యం జయంతి సందర్భంగా గ్లోబల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో భాస్కర ఆడిటోరియంలో 'జయహో కూచిపూడి' పేరిట నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన కొలేటి దామోదర గుప్తా, ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణుడు దైవజ్ఞ శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లయన్ డాక్టర్ రమణరావు గ్లోబల్ ఈవెంట్స్, జై జవాన్ జై కిసాన్ జై కళాకార్, ఏబీసీ ఫౌండేషన్ తదితర సంస్థల సహకారంతో సంప్రదాయ కళలను ప్రోత్సహిస్తూ, వాటి



మిస్ ఇండియా జార్జియస్ టైటిల్ విన్నర్ అలిసియాను సన్మానిస్తున్న కోలేటి దామోదర గుప్త,లయన్ కె వి రమణారావు, దైవజ్ఞశర్మ తదిత

పరిరక్షణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలోనూ తల్లిదండ్రులు తమ పిల్లలను కూచిపూడినాట్యంలోప్రోత్సహించడంసంతోషకరమన్నారు.మిస్ గార్జియస్ ఇండియా విజేత అలీసియా జోసెఫ్ మాట్లాడుతూ, సంప్రదాయ కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం



జబర్దస్త్ ఫేమ్, హీరో నేహాంత్ మోహన్ ను సన్మానిస్తున్న దామోదర్ గుప్తా, లయన్ కె వి రమణారావు, దైవజ్ఞశర్మ తదితరులు...

ఉందన్నారు. కార్యక్రమంలో జబర్దస్త్ నటుడు జి. నేహాంత్ మోహన్ పాల్గొన్నారు. సభకు ముందు నృత్య గురువులు దేవి శ్రుతి, ఆశ్రిత, సరోజ చంద్రలేఖ, ఎ. శ్రీదేవి, రేధి బిల్లకంటి శిష్యబృందాలు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

# లలిత కళా తోరణంలో అటుకుల బతుకమ్మ వేడుకలు











**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ అక్టోబర్ 11:** తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని లలిత కళా తోరణంలో అక్టోబర్ 11, 2026న అటుకుల బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, పుష్ప సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. తెలంగాణకు ప్రతిష్టాత్మకమైన పుష్ప పండుగ అయిన బతుకమ్మ విశిష్టతను ఈ వేడుకలు చాటిచెప్పాయి. బతుకమ్మ తెలంగాణ సమృద్ధమైన సాంస్కృతిక సంప్రదాయాలకు, మహిళా శక్తికి, ప్రజలకు--ప్రకృతికి మధ్య ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ సందర్భంగా తెలంగాణ సంప్రదాయ కళారూపాలను ప్రతిబింబించే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాకారులుప్రదర్శించిన మనోహరమైన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నృత్యంలోని హావభావాలు, సొగసైన కదలికలు భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించాయి. అదేవిధంగా సంప్రదాయ డప్పులప్రదర్శనలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని, పండుగ శోభను తీసుకొచ్చాయి. అటుకుల బతుకమ్మ వేడుకలు తెలంగాణకు చెందిన స్థానిక సంప్రదాయాలు, జానపద కళలు, శాస్త్రీయ నృత్యాలు మరియు సాంస్కృతిక గుర్తింపును ప్రోత్సహించేందుకు ఒక వేదికగా నిలిచాయి. ఇటువంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర సమృద్ధమైన అమూర్త సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించడం, అలాగే తెలంగాణ వైభవమైన పండుగలను పర్యాటకులు, ప్రజలకు పరిచయం చేయడం తెలంగాణ పర్యాటక శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

# పల్లెకోనలో ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

## –అమ్మవారి పూజల్లో పాల్గొన్న మల్లోలు శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతులు (విగ్రహ దాతలు)





**భట్టిప్రోలు, ట్రైనెట్ న్యూస్ అక్టోబర్ 11:** వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామంలోని గౌడ పాలెం లో ఆదివారం దసరా నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు నిర్వహించిన అమ్మవారి పూజా కార్యక్రమాల్లో అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మల్లోలు శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA.
www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136